




# విజయభాను








హైదరాబాద్, గురువారం 12-10-2017 | VIJAYABHANU DAILY HYDERABAD EDITION | సంపుటి : 37 సంచిక : 29 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం..

# అభివృద్ధిలో భాగస్వామ్యమే

- ప్రభుత్వంతో నిరంతర చర్చలు
- భారత ప్రధాని మోదీ




దిల్లీ: ప్రజాస్వామ్య బలం ఓట్లకు మాత్రమే పరిమితం కాదని.. నిజమైన ప్రజాస్వామ్యం అంటే ప్రజలు భాగస్వాములు కావడమేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దిల్లీలో జరిగిన నానాజీ దేశ్‌ముఖ్ శత జయంతి ఉత్సవాల్లో ఆయన ప్రసంగించారు. దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో సుపరిపాలన లేదన్నారు. ఎన్ని ఓట్లు వచ్చాయనేది ఒకటే ప్రజాస్వామ్యానికి బలం కాదు. ఓట్లు ముఖ్యమే కానీ.. ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం మాత్రం అభివృద్ధిలో ప్రజలను భాగస్వాముల్ని చేయడమే. ఇందుకోసం ప్రభుత్వంతో నిరంతర చర్చలు అవసరం అని మోదీ అన్నారు. సరైన సమయంలో చొరవ తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపడితేనే వాటి ఫలాలు లబ్ధిదారులకు చేరతాయన్నారు. పట్టణాలు, నగరాల్లో ఉండే సదుపాయాలను గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కల్పించాలన్నారు. నానాజీ దేశ్‌ముఖ్ సేవలను ప్రధాని కొనియాడారు.

## రబీ నుంచి వ్యవసాయానికి 24 గంటల కరెంట్!



హైదరాబాద్ : వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరాపై ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుతో ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడారు. రబీ నుంచి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశాలిచ్చారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇచ్చేందుకు విద్యుత్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసిందని సీఎం కేసీఆర్‌కు ప్రభాకర్‌రావు తెలిపారు.

ఇప్పటికే ఉమ్మడి మెదక్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ ప్రయోగం విజయవంతమైందని ప్రభాకర్‌రావు సీఎంకు వివరించారు. వచ్చే ఫిబ్రవరి నుంచి రాష్ట్రంలో అన్ని వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల కరెంట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రభాకర్‌రావు స్పష్టం చేశారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ ఇచ్చేందుకు సూర్యాపేట జిల్లాలో చివ్వెంలలో రూ. 1600 కోట్లతో 400 కేవీ సబ్‌స్టేషన్‌ను సీఎం కేసీఆర్ రేపు ప్రారంభిస్తారని ప్రభాకర్‌రావు తెలిపారు.

**విద్యుత్ ఉద్యోగులను అభినందించిన సీఎం**

వ్యవసాయానికి 24 గంటలు విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. వాణిజ్య, గృహ అవసరాలకు 24 గంటల విద్యుత్ సరఫరాపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 9600 మెగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్ ఉందన్నారు. మిషన్ భగీరథ, ప్రాజెక్టుల ఎత్తిపోతల పథకాలకు అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నామని ప్రభాకర్‌రావు పేర్కొన్నారు.

వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ అందించే మొదటి, ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కొత్త చరిత్ర సృష్టిస్తుందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల కరెంట్ ఇచ్చేందుకు చేసిన ఏర్పాట్లను తానే స్వయంగా ప్రారంభిస్తానని సీఎం తెలిపారు. అతి తక్కువ సమయంలో ఏర్పాట్లు చేసి ప్రభుత్వ సంకల్పాన్ని నెరవేర్చడానికి కృషి చేసిన ప్రభాకర్‌రావు నాయకత్వంలోని విద్యుత్ అధికారులు, ఉద్యోగులను సీఎం అభినందించారు.

**సిద్ధిపేట జిల్లా కొత్త కలెక్టరేట్‌కు సీఎం శంకుస్థాపన**

కొండపాక మండలం దుద్దెడలో జిల్లా కార్యాలయ సముదాయం, పోలీస్ కమిషరేట్ నిర్మాణాలకు సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. సీఎం కేసీఆర్ భవనాల నమూనాలను పరిశీలించిన అనంతరం శిలాఫలకాలను ఆవిష్కరించారు. అదేవిధంగా తరువాయి 2లో

## పాదయాత్రపై భవిష్యత్ కార్యాచరణ

- 3 వేల కి.మీ., 120 నియోజకవర్గాలు
- నేతల, అభిమానుల సూచనలు, సలహాలు
- జగన్ అధ్యక్షతన ముగిసిన కీలక సమావేశం

హైదరాబాద్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కీలక సమావేశం ముగిసింది. పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఉదయం జరిగిన ఈ భేటీలో నవంబర్ 2వ తేదీ నుంచి తలపెట్టిన పాదయాత్ర ఏర్పాట్లు, భవిష్యత్ కార్యాచరణపై చర్చ జరిగింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, అనుబంధ విభాగాల రాష్ట్ర అధ్యక్షులు, అన్ని జిల్లాల పరిశీలకులు, జిల్లా అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల పార్టీ సమన్వయకర్తలు ఈ భేటీకి హాజరయ్యారు. ఈ సమావేశానికి సంబంధించిన వివరాలను పార్టీ ఎంపీ మేకపాటి రాజమోహన్ రెడ్డి మీడియాకు వెల్లడించారు.


*నవంబర్ 2 నుంచి పాదయాత్ర*

వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నవంబర్ 2వ తేదీ నుంచి పాదయాత్ర ప్రారంభించనున్నట్లు ఎంపీ మేకపాటి తెలిపారు.

## ముందస్తు సమాచారమిస్తే సర్దుకుపోతారు

### అలాంటి సందర్భాల్లో పారదర్శకత పనికిరాదు
### కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ

వాషింగ్టన్: నోట్ల రద్దుపై అత్యంత గోప్యతను పాటించడాన్ని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సమర్థించారు. ఈ అంశంలో పారదర్శకత లేకుండా, ముందస్తు సమాచారమిస్తే నోట్ల రద్దు అక్రమాలకు నిలయమయ్యేదని చెప్పారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్‌ల వార్షిక సదస్సుల్లో పాల్గొనేందుకు అమెరికాలో పర్యటిస్తున్న జైట్లీ నోట్ల రద్దు, జీఎస్‌టీ వంటి నిర్ణయాలు భారత ఆర్థిక వ్యవస్థను పటిష్ట



స్థితిలో నిలిపేలా సాగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న వ్యవస్థాగత మార్పులతో రానున్న రోజుల్లో దేశ ఆర్థిక వ్యవస్థ పూర్తి ప్రక్షాళన కావడంతో పాటు సుధృఢ ఆర్థిక తరువాయి 2లో

### కొరియాపై అమెరికా
## యుద్ధవిమానాలు
### ఉత్తరకొరియాకు దీటుగా అమెరికా బదులు



సియోల్: అగ్రరాజ్యం అమెరికా, ఉత్తరకొరియా మధ్య గత కొంతకాలంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. అణుదాడి చేస్తామంటూ వరుస హెచ్చరికలకు దిగుతున్న ఉత్తరకొరియాకు దీటుగా బదులిచ్చేందుకు అమెరికా కూడా సమాయత్తమవుతోంది. ఇందులో భాగంగానే ఉత్తరకొరియా నుంచి వచ్చే ముప్పుపై ఎలా స్పందించాలనే తరువాయి 2లో


## ఆబ్కారీ సహాయ కమిషనర్ ఇళ్లల్లో సోదాలు



హైదరాబాద్ : అవినీతి నిరోధక శాఖ వలకు ఆబ్కారీశాఖ సహాయ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి చిక్కారు. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న అభియోగాలతో శ్రీనివాస్‌రెడ్డి ఇళ్లల్లో అనిశా అధికారులు సోదాలు చేపట్టారు. ఓల్డ్‌బోయిన్‌పల్లి రామరాజు కాలనీలోని ఆయన నివాసంలో అనిశా డీఎస్పీ సునీత, రవికుమార్ ఆధ్వర్యంలో 10 మంది సభ్యుల బృందం తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీల్లో విలువైన ధ్రువపత్రాలు, నగదు, నగలు, బ్యాంక్ పాస్ బుక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ పట్టణంలోని జ్యోతినగర్‌లోని ఆయన సోదరుడి ఇంటితోపాటు రాష్ట్రవ్యాప్తంగా 10 చోట్ల ఏకకాలంలో సోదాలు కొనసాగుతున్నాయి.

## మైనర్ భార్యతో శృంగారం అత్యాచారమే

### సుప్రీం సంచలన తీర్పు



దిల్లీ: మైనర్ భార్యతో శృంగారం అంటే అది అత్యాచారం లాంటిదేనని సుప్రీంకోర్టు బుధవారం సంచలన ప్రకటన చేసింది. ఇలాంటి కేసుల్లో 15 నుంచి 18ఏళ్ల లోపు వివాహిత బాలికలను మినహాయించడం రాజ్యాంగబద్ధం కాదని స్పష్టం తరువాయి 2లో

### టేకిట్ ఈజీ



ఆర్జీవి పై మాటల దాడి చేస్తే...
దాన్నీ తన సినిమా
పబ్లిసిటీకి వాడుకుంటాడు సార్ !!

## కాలుష్యరహితంగా ఫార్మాసిటీ

### సామాజిక బాధ్యతగా ప్రతి కంపెనీకి ఒక గ్రామం దత్తత

హైదరాబాద్: రాష్ట్ర రాజధాని శివారులో ఏర్పాటుచేయనున్న ఫార్మాసిటీ ప్రపంచంలోనే అతి పెద్దదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి కే తారకరామారావు చెప్పారు. ఇందులో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు రూ.64వేల కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నాయని తెలిపారు. ఫార్మాసిటీలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 4.20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని చెప్పారు. ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా, అత్యాధునిక సదుపాయాలు, వసతులతో రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల సమీపంలో ఏర్పాటుచేస్తున్న హైదరాబాద్ ఫార్మాసిటీ (హెచ్‌పీసీ)కి ప్రజలంతా సహకరించాలని విజ్ఞప్తిచేశారు. కాలుష్యం విషయంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన నొక్కిచెప్పారు. ఫార్మాసిటీలో పనిచేసే తరువాయి 2లో






# అడుగంటిన బొగ్గు నిల్వలు

బెంగళూరు: బళ్లారి, రాయచూరు తాప విద్యుత్తు కేంద్రాలు ఎదుర్కొంటున్న బొగ్గు కొరత సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వంతో మంతనాలు జరిపేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దిల్లీకి వెళ్లనున్నారు. ఆయనతో బాటు ఇంధన మంత్రి శివకుమార్, కరా?టక విద్యుదుత్పత్తి సంస్థ, సంబంధిత ఉన్నతాధికారులు కూడా ఉంటారు. గురువారం బొగ్గు, రైల్వే శాఖల మంత్రి పీయుశ్ గోయల్‌తో వారంతా సమావేశమవుతారు.

బళ్లారి, రాయచూర్ తాప విద్యుత్తు కేంద్రాల్లో ప్రస్తుతం ఒక రోజు ఉత్పాదనకు సరిపోయేంత బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయి. రాష్ట్రానికి ప్రత్యేకంగా బొగ్గు గని లేదు. కేంద్రం అనుమతించిన పశ్చిమ, మహానది, సింగరేణి గనుల నుంచి మాత్రమే బొగ్గును కొనాలి. వివిధ కారణాలతో కొన్ని రోజులుగా ఆ గనుల నుంచి బొగ్గు సరఫరా ఆగిపోయింది. రాయచూరు తాప విద్యుత్తు కేంద్రంలో 1, 2, 7 యూనిట్ల విద్యుదుత్పాదని నిలిపి వేశారు. బళ్లారిలో రెండో యూనిట్‌లో మాత్రమే ఉత్పత్తి సాగుతోంది. రాయచూరు, బళ్లారి కేంద్రాలకు వరుసగా రోజుకు 30 వేలు, 22 వేల టన్నుల బొగ్గు అవసరం. బొగ్గు కొరత వల్ల విద్యుదుత్పాదనకు అవరోధం కలిగింది. అప్పుడప్పుడూ ఉత్పాదనను అనివార్యంగా నిలిపేస్తున్నామని ఇంధన శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. వర్షాల వల్ల విద్యుత్తు ఆవశ్యకత పరిమాణం తగ్గటంతో ఇటు ప్రజలు, అటు ప్రభుత్వానికి కాస్త ఉపశమనం కలిగింది. లేని పక్షంలో హాహాకారాలు చెలరేగేవి. వెంటనే బొగ్గు సరఫరాకు చర్యల్ని తీసుకోవాల్సిందిగా పీయూశ్ గోయల్‌ను కోరనున్న సిద్ధరామయ్య బెంగళూరులో సబర్బన్ రైలు నడిపేందుకు చర్యల్ని తీసుకోవాలని విన్నవించనున్నారు. రైల్వే శాఖ మాజీ మంత్రి సురేశ్ ప్రభు నగరానికి సబర్బన్ రైలును మంజూరు చేస్తామని భరోసా ఇవ్వటం తెలిసిందే.

## మానసిక రోగంపై ప్రజల్లో అవగాహన అవసరం



రాయచూరు : మనిషి దృఢంగా ఉండేందుకు మానసిక ఆరోగ్యం కూడా అవస రమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బైలూరు శంకరరామ అన్నారు. ప్రపంచ మానసిక దినోత్సవం సందరరేగా ఆయన జిల్లాధికారి కార్యాలయం వద్ద జాతాను ప్రారంభించి మాట్లాడారు. ఒత్తిళ్ల మధ్య జీవనం సాగిస్తున్నం దున మానసిక రోగంతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారులు మానసికంగా బాధపడటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మానసిక వైద్యులను కలిసి చికిత్స తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు.

మానసిక రోగం బారిన ఎందుకు పడుతున్నారన్న విషయమై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాధికారి గౌతమ్, సీఈవో అభిరామ్ శంకర్, డీహెచ్ఓ డాక్టర్ నాసీర్ పాల్గొన్నారు.

జిల్లాధికారి కార్యాలయం వద్ద ఆరంభమైన జాతా ప్రధాన వీధుల మీదుగా సంచరించి డీహెచ్ఓ కార్యాలయానికి చేరుకుంది.

## మద్యం నిషేధంపై విధానం ప్రకటించండి

సింధనూరు :వచ్చే ఏడాది కరా?టకలో జరిగే విధానసభ ఎన్నికలకు ముందే వివిధ పార్టీలు రాష్ట్ర వ్యాప్తంగా మద్యం నిషేధంపై తమ ఎన్నికల ప్రణాళికల్లో పొందుపర్చాలని డిమాండ్ చేస్తూ పోరాటాన్ని రూపొందిస్తున్నట్లు కర్ణాటక మద్య నిషేధ ఆందోళన సమితి ప్రముఖురాలు విరుపమ్మ తెలిపారు. స్థానిక ప్రవాసి మందిర్‌లో మంగళవారం పాత్రికేయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మద్య నిషేధంపై ఇప్పటికే మూడు విధాలుగా పోరాటం జరిపామని, ప్రభుత్వం స్పందించలేదని ఆమె చెప్పారు. మొత్తం 30 పోరాట సంఘాలు కలిసిన ఆందోళన సమితి ఇకపై మరింత బలంతో పోరాడబోతోందని వివరించారు. అందులో భాగంగా ఈ నెల 29న 'రాయచూరు చలో' పోరాటాన్ని జరుపుతున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని తాలూకాల నుంచి సుమారు 40 వేల మంది కార్యకర్తలు ఇందులో పాల్గొని ప్రభుత్వం కళ్లు తెరిపించే ప్రయత్నం చేయబోతున్నట్లు చెప్పారు. సమావేశంలో యాకూబ్ అలీ, మల్లమ్మ, బసవరాజ్, ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## హిజ్రాలకు రిజర్వేషన్లు కల్పించాలి



భువనేశ్వర్ : లోక్‌సభ, విధానసభ, పురపాలక సంస్థలు, పంచాయతీ ఎన్నికల్లో హిజ్రాలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేస్తూ రాష్ట్ర హిజ్రాల సంఘం ఆందోళన చేపట్టింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ ఆజాద్ పాణిగ్రాహికి వినతిపత్రం అందించారు. ఆందోళనకారులు తెలిపిన వివరాల ప్రకారం... హిజ్రాలలో ఎంతో మంది ఉన్నత విద్యావంతులు ఉన్నారు. వారు కూడా సంఘసేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు.

## ఎమ్మెకేసీజీలో పరిస్థితిని చక్కదిద్దండి

బ్రహ్మపుర : దక్షిణ ఒడిశా జిల్లాల ప్రజలకు ప్రధాన ఆరోగ్య కేంద్రమైన స్థానిక ఎమ్మెకేసీజీ వైద్య కళాశాల ఆసుపత్రిలో అస్తవ్యస్తంగా మారిన పరిస్థితులను చక్కదిద్దాలని, రోగులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలని స్థానిక ఫోరం ఫర్ గంజాం విన్నవించింది.

ఫోరం ప్రతినిధులు స్థానిక దక్షిణ మండల ఆర్డీసీ కార్యాలయం ఆవరణలో ప్రదర్శన చేపట్టారు.

అనంతరం ఫోరం ప్రతినిధులు ముఖ్యమంత్రి పేరిట ఓ వినతిపత్రాన్ని దక్షిణ మండల ఆర్డీసీ టి.ఆవోకు అందజేశారు. ఆసుపత్రిలో అరవైకిపైగా వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వందలాది మంది నర్సులు, తదితర పోస్టులు దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్నాయని, వెంటనే వాటిని భర్తీ చేయాలని ఆ వినతి పత్రంలో కోరారు. ఆసుపత్రిలో మూలనపడ్డ ట్రామా కేర్ కేంద్రాన్ని పునః ప్రారంభించాలని వారు పేర్కొన్నారు. ఎమ్మెకేసీజీలో సమస్యలపై గత నెలలో ముఖ్యమంత్రి పేరిట ఫోరం ఇచ్చిన వినతిపత్రంపై పలు చర్యలు తీసుకున్నామని ఆర్డీసీ ఆవో తెలిపారని ఫోరం ప్రతినిధి సుధీర్ రౌత్ చెప్పారు.

సాయంత్రం ఆయన మాట్లాడుతూ ఎమ్మెకేసీజీలో ఏడు బ ృందాలతో ఆకస్మిక దాడులు నిర్వహించామని, పలు అంశాలు వెలుగులోకి వచ్చాయని, వాటి నివేదికను ప్రభుత్వానికి పంపించామని ఆర్డీసీ ఆవో తెలిపారని ఆయన వివరించారు.

ఆర్డీసీను కలిసిన వారిలో ఫోరం ప్రతినిధులు ఈ.తేజేశ్వరరావు, వి.ఆర్.రాజు, అబనీ కుమార్ గయా, సబితా షాహుకార్ తదితరులున్నారు.

## ఉపకార వేతనం ఉత్తర్వులు రద్దు చేయాలి

కోయంబత్తూరు : 'పోస్టు మెట్రిక్ ఎడ్యుకేషనల్ అసిస్టెన్స్' పథకం కింద విద్యార్థులకు అందిస్తున్న ఉపకారవేతనాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేయాలని కోరుతూ విద్యార్థులు కలెక్టరుకు విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ కల్వి సెంటినరీ మూవ్‌మెంట్‌కు చెందిన విద్యార్థులు సోమవారం కలెక్టరును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్ కళాశాలల్లో లక్షన్నర మంది వెనుకబడిన తరగతుల వారు చదువుతున్నారని, ఈ ఏడాది 40 వేల మంది వరకు చేరారని గురుత చేశారు. ఉపకార వేతనం కింద వారికి రూ.85 వేలు అందిస్తున్నారని, అయితే ఇటీవల ఆది ద్రావిడర్ సంక్షేమ శాఖ దీనిని రూ.50 వేలకు పరిమితం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

## రైతుల పాలిట భయం'కరి'



పర్లాఖెముండి : గజపతి జిల్లా గుసాని సమితి దుర్గంకొండ ప్రాంతంలో ఐదు రోజులుగా ఏనుగుల గుంపు సంచరిస్తోంది. సుమారు ఏడు ఏనుగులు ఇందులో ఉన్నాయని, ఇవి ఈ ప్రాంత వరి పొలాలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు అంటున్నారు. ఏనుగుల భయానికి పొలానికి వెళ్లడానికి కూడా భయపడుతున్నామని వారంటున్నారు. ఇంతవరకు ఎన్ని ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లింది కూడా చెప్పలేని పరిస్థితి ఉందని వారంటున్నారు. మా గోడు ఎవరికి వినిపించాలో తెలియక సతమత మవుతున్నామని వారు పేర్కొంటున్నారు. చీకటిపడిన అనంతరం రోడ్డుపై తిరిగేందుకు కూడా వాహనచోదకులు భయపడుతున్నారు. గారబంద అటవీ సిబ్బంది ఈ ప్రాంతంలో తిరుగుతున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని సీపీఎం(ఎల్) లిబరేషన్ నాయకుడు బిద్యాధర్ పాత్ర్ ప్రభుత్వాన్ని కోరారు. ఏనుగులు రాత్రిపూట కొంతదూరం వెళ్లి తిరిగి దుర్గంకొండ ప్రాంతానికి తిరిగివస్తున్నాయని రైతులు చెబుతున్నారు. గుసాని సమీపంలో మెయిన్‌రోడ్డు పక్కన గల శిరిడి సాయి మందిరం వెనుకభాగంలో పగటి పూట ఏనుగులు సంచరిస్తున్నాయి.

## 347 గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించండి

భువనేశ్వర్ : రాష్ట్రంలో విద్యుత్తు సౌకర్యం లేని 347 గ్రామాల్లో వెలుగులు నింపాలని కోరుతూ కేంద్ర ఆదివాసీ సంక్షేమశాఖ మంత్రి జోయల్ ఓరం ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌కు లేఖ రాశారు. లేఖలో ఉన్న వివరాల ప్రకారం... 2015 ఆగస్టు 15న కేంద్ర ప్రభుత్వం దేశంలో ఉన్న 18,452 గ్రామాలకు వెయ్యి రోజుల్లో విద్యుత్తు సౌకర్యం కల్పించాలని లక్ష్యంగా తీసుకుంది.

సెప్టెంబరు వరకు 15,466 గ్రామాలకు ఈ సౌకర్యం కల్పించింది. ఒడిశాలోని వివిధ జిల్లాల్లో 347 గ్రామాలకు నేటికీ ఆ భాగ్యం దక్కలేదు. ప్రభుత్వం శ్రద్ధ తీసుకుని సకాలంలో ఆయా గ్రామాల్లో వెలుగులు నింపి కేంద్రం చేపట్టిన కార్యక్రమానికి సహకరించాలని సీఎంకి విన్నవించారు.

## రైల్వే ప్రమాదాల నివారణే లక్ష్యం

బెంగళూరు: మానవ రహిత రైల్వే క్రాసింగ్‌లో లెక్కకు మిక్కిలి ప్రమాదాల్ని మనం చూస్తూనే ఉన్నాం. ఈ ప్రమాదాల్ని అరికట్టేందుకు బెంగళూరు నగర విద్యార్థులు ఉత్తమ పరిష్కారాన్ని కనుగొన్నారు. స్థానిక సీఎంఆర్ ఐటీ విద్యార్థులు రూపొందించిన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ ఆధారిత స ృజన మూడు దశల భద్రత వ్యవస్థలతో ప్రమాదాల్ని అరికడుతుంది. ఇందులో తొలి దశలో ఆప్టికల్, రెండో దశలో ఆర్ఎఫ్ఐడీ సెన్సార్(రేడియో ఫ్రీక్వెన్సీ), మూడో దశలో గేట్లను మూసివేసే వ్యవస్థలు అత్యంత భద్రతా వలయాన్ని స ృష్టిస్తాయని పరిశోధక విద్యార్థి బ ృందం సభ్యులు మాళవిక వినయ్ చెప్పారు గ్రామీణ ప్రాంతాలతో పాటు రెండో శ్రేణి పట్టణాల్లోని మానవ రహిత రైల్వే గేట్లలో సంభవించే ప్రమాదాలకు ఇదో చక్కని పరిష్కారమన్నారు. రెండు కిలోమీటర్ల పరిధి వరకు ప్రమాద హెచ్చరికలు చేసే ఈ వ్యవస్థలో తుది దశలో ఎరుపు సంకేతాలతో పాటు గేట్లు వాటంతట అవే మూసి వేసేలా ఏర్పాట్లుంటాయి. ఇటీవల నగరంలో నిర్వహించిన స ృష్టి స ృజనోత్సవంతో పాటు రాజస్థాన్‌లో నిర్వహించిన ప్రపంచ హ్యాకథాన్ తుది జాబితాలో ఈ స ృజన చోటు సంపాదించుకుందని వీరు చెప్పారు. మొత్తం ఐదుగురు విద్యార్థులు సభ్యులుగా ఉన్న ఈ బ ృందానికి ఆచార్య సుధీర్ రోట్రీ, ఆచార్య షర్మిళ తదితరులు మార్గదర్శకత్వం వహించారు.



### మొదటి పేజీ తరువాయి

## రబీ నుంచి వ్యవసాయానికి 24 గంటల కరెంట్!

సిద్దిపేట మండలం ఎన్సాన్ పల్లిలో మెడికల్ కాలేజ్ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు, ఎంపీలు వినోద్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, రామలింగారెడ్డితోపాటు ఎమ్మెల్సీలు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కాలుష్యరహితంగా ఫార్మాసిటీ

ఉద్యోగులు మొదలు అధికారులవరకు అక్కడే నివాసం ఉండేందుకు రెసిడెన్షియల్ టౌన్‌షిప్ నిర్మిస్తున్నామని తెలిపారు. అక్కడ కాలుష్యం ఉండబోదనేందుకు ఇదే నిదర్శనమన్నారు.

ఈ విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తిచేశారు. భూములు కోల్పోయేవారికి ఉదారంగా మెరుగైన పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ఆయన ప్రకటించారు. భూమి కోల్పోయినవారికి ఇంటికో ఉద్యోగం ఇస్తామని, అవసరమైతే వారికి స్కిల్ డెవలప్‌మెంట్‌లో ప్రభుత్వ ఖర్చుతోనే శిక్షణ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఫార్మాసిటీపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో మంగళవారం హెచ్ఐసీసీలో పరిశ్రమలశాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌రంజన్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తినాగప్పన్‌లతో కలిసి మీడియా సమావేశంలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. ఫార్మాసిటీపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తూ.. కాలుష్య నివారణ, ఉపాధి అవకాశాల కల్పన, భూములు కోల్పోయేవారికి మెరుగైన పరిహారం.. ఈ మూడు కీలక అంశాలపై మంత్రి సమగ్రంగా వివరించారు. హెచ్‌పీసీకి కేంద్రం సూత్రప్రాయంగా నిమ్జ్ హోదా కల్పించిందన్నారు. డీపీఆర్ లేకుండా ఫార్మాసిటీ ఎలా చేపడుతున్నారంటూ కాంగ్రెస్ నాయకులు మాట్లాడటం ఈ దశాబ్దపు పెద్ద జోక్ అని ఆయన ఎద్దేవాచేశారు. ఇంత పెద్ద ప్రాజెక్టు చేపడుతున్నప్పుడు డీపీఆర్ లేకుండా చేస్తారా? కాంగ్రెస్ నాయకులు డీపీఆర్ అడిగితే ఇస్తాం. వారికి చదువడం రాకుంటే ఎవరైనా చదువు వచ్చిన వారితో చదివించుకుని అర్థం చేసుకుంటే మంచిది అని హితవు పలికారు.

కాంగ్రెస్ నిర్వాకాలతోనే అపోహలు

ప్రజలకు ఫార్మా పరిశ్రమలపై అపోహలు, అనుమానాలు, భయాందోళనలు కలుగటానికి కాంగ్రెస్ నిర్వాకాలే కారణమని కేటీఆర్ చెప్పారు. అప్పట్లో సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేకుండా వ్యవహరించడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. పాశమైలారం, జీడిమెట్ల, పటాన్‌చెరువు తదితర అనేక పారిశ్రామికవాడల్లో సమస్యలు వచ్చాయి. ఇకపై అలా జరుగకుండా ఒకేచోట పరిశ్రమలు ఏర్పాటుచేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది అని తెలిపారు. సీఈటీపీలను ఏర్పాటు చేయడానికి, 24 ఎంఎల్‌డీల సామర్థ్యంతో వ్యర్థాలను శుద్ధి చేయడానికి ఇప్పటికే ఆర్ఎఫ్‌పీ (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్)ని పిలిచాం. అనేక ప్రముఖ పారిశ్రామిక పార్కుల్లో సేవలందిస్తున్న ఎనిమిది అంతర్జాతీయ కంపెనీలు ముందుకొచ్చాయి. ఇలాంటివి ముందుకొచ్చి సీఈటీపీలను ఏర్పాటుచేయడం ద్వారా కాలుష్య సమస్యను సులువుగా దూరం చేయవచ్చు. చిత్తశుద్ధి ఉంటే ఇది సాధ్యమవుతుంది అని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ నాయకులు వాళ్ల మాదిరిగానే ఇతరులు చేస్తారనుకుంటే ఎట్లా అంటూ విమర్శించారు. ప్రతిపక్షాలు ప్రజలను గందరగోళపర్చాలని చూస్తున్నాయన్నారు. ఆషామాషీగా కాకుండా ప్రపంచంలోని ప్రఖ్యాత సంస్థతో మాస్టర్ ప్లాన్ రూపొందించామన్నారు. లైవ్, వర్క్, లెర్న్, ప్లే విధానంలో హెచ్‌పీసీని నిర్మిస్తున్నామని చెప్పారు.

## మైనర్ భార్యతో శృంగారం అత్యాచారమే

చేసింది. ఐపీసీ చట్టాల ప్రకారం.. ఓ వ్యక్తి 18ఏళ్ల కంటే తక్కువ వయసున్న బాలికతో లైంగిక చర్యలో పాల్గొనడం నేరం. ఇందులో బాలిక ఇష్టం ఉన్నా లేకపోయినా దీన్ని నేరంగానే పరిగణిస్తారు. అయితే సదరు బాలిక అతడి భార్య అయి ఉండి.. ఆమె వయసు 15ఏళ్లు మించితే ఈ చట్టం నుంచి మినహాయింపు కల్పించారు.

అయితే ఈ మినహాయింపును వ్యతిరేకిస్తూ ఓ ఎన్జీవో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వివాహితులైన మైనర్లతో లైంగిక చర్య ఎంతమాత్రం సరైనదని కాదని పిటిషన్‌లో పేర్కొంది. బాల్యవివాహమే చట్టవ్యతిరేకం అయినప్పుడు 15ఏళ్ల నుంచి 18ఏళ్ల బాలికలపై కాపురం పేరుతో లైంగికచర్యకు పాల్పడటం చట్టమెలా అవుతుందని ప్రశ్నించింది.

దీనిపై విచారించిన న్యాయస్థానం.. నేడు పై తీర్పు వెల్లడించింది. 15 ఏళ్ల నుంచి 18ఏళ్ల మధ్య వివాహిత బాలికలపై లైంగికచర్యను చట్టప్రకారం నేరం నుంచి మినహాయించడం రాజ్యాంగ విరుద్ధమని న్యాయస్థానం స్పష్టం చేసింది. మైనర్లతో శృంగారం అంటే అది అత్యాచారం లాంటిదేనని.. దాన్ని నేరంగానే పరిగణించాలని తెలిపింది.

## పాదయాత్రపై భవిష్యత్ కార్యాచరణ

ఆరు నెలల పాటు 3వేల కిలోమీటర్ల మీదగా 120 నియోజకవర్గాల్లో పాదయాత్ర కొనసాగుతుందన్నారు. అలాగే మిగతా 55 నియోజకవర్గాల్లో బస్సు యాత్ర చేపడతారని ఆయన పేర్కొన్నారు. పాదయాత్రపై పార్టీ నేతలతో వైఎస్ జగన్ చర్చించారన్నారు. ఈ సమావేశంలో పార్టీ నేతల సూచనలు, సలహాలను ఆయన అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు.

## ముందస్తు సమాచారమిస్తే సర్దుకుపోతారు

వ్యవస్థగా ఎదిగేందుకు బాటలు పడతాయని చెప్పారు. నోట్ల రద్దుపై ముందస్తు సమాచారం ఇస్తే ప్రజలు తమ చేతుల్లో ఉన్న డబ్బుతో బంగారం, డైమండ్, భూములు కొనడంతో పాటు పలు నగదు లావాదేవీలకు పాల్పడేవారని ప్రతిష్టాత్మక కొలంబియా యూనివర్సిటీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ జైట్లీ చెప్పుకొచ్చారు. పారదర్శకత వినడానికి ఇది మంచి పదం.. కానీ ఈ విషయంలో పారదర్శకత పాటించినట్టయితే అది తీవ్ర తప్పిదాలకు దారితీసేది అని వ్యాఖ్యానించారు.నోట్ల రద్దు అనంతరం ప్రజల్లో చిన్నపాటి అలజడి కూడా చోటుచేసుకోలేదని, ఇదే ఈ నిర్ణయం విజయవంతమైందనడానికి సంకేతమని జైట్లీ తెలిపారు. నోట్ల రద్దుతో ప్రజలకు తీవ్ర అసౌకర్యం ఏర్పడినా దేశ ప్రయోజనాల కోసం దీన్ని స్వాగతించారని చెప్పారు. నోట్ల రద్దు ఫలితంగా డిజిటల్ లావాదేవీలు రెట్టింపయ్యాయని, పెద్దసంఖ్యలో ప్రజలు పన్ను పరిధిలోకి వచ్చారన్నారు.

## కొరియాపై అమెరికా యుద్ధవిమానాలు

అంశంపై రక్షణశాఖ అధికారులతో ట్రంప్ నేడు సమావేశమయ్యారు. కాగా.. ఇదే సమయంలో కొరియన్ పెనిన్సులాపై అమెరికా యుద్ధవిమానాలు చక్కర్లు కొట్టడం గమనార్హం.

అమెరికాకు చెందిన రెండు విమానాలతో పాటు దక్షిణకొరియా మిలిటరీకి చెందిన రెండు ఫైటర్ జెట్‌లు కొరియన్ పెనిన్సులాపై చక్కర్లు కొట్టాయి. అయితే అమెరికా, దక్షిణకొరియా సంయుక్తంగా డ్రిల్ చేపట్టిందని.. అందులో భాగంగానే యుద్ధ విమానాలు వెళ్లినట్లు దక్షిణకొరియా అధికారిక ప్రకటన వెలువరించింది. మరోవైపు అమెరికా మిలిటరీ కూడా దీనిపై స్పందించింది. జపాన్‌కు చెందిన యుద్ధవిమానాలు కూడా ఈ డ్రిల్‌లో పాల్గొన్నట్లు పేర్కొంది.

అమెరికా, జపాన్, దక్షిణకొరియా సంయుక్తంగా మిలిటరీ డ్రిల్ నిర్వహించడం ఇదే తొలిసారి. ఇటీవల అమెరికాపై ఉత్తరకొరియా వరుస హెచ్చరికలు చేసిన విషయం తెలిసిందే. అమెరికా అధీనంలో ఉన్న గువామ్ ద్వీపంపై అణుదాడి చేస్తామని బెదిరింపులకు దిగింది. దీంతో ఉత్తరకొరియా ఆగడాలను అరికట్టేందుకు అమెరికా కూడా చర్యలు చేపట్టింది. గువామ్ బేస్ నుంచే ఈ యుద్ధవిమానాల డ్రిల్ చేపట్టింది.

## గడువులోపు అభివృద్ధి పనులు పూర్తి

తిరువణ్ణామలై : తిరువణ్ణామలైలోని గిరి ప్రదక్షిణ మార్గంలో రూ.63 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్తీక దీపోత్సవానికి ముందే పూర్తిచేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కె.ఎస్.కందస్వామి పేర్కొన్నారు.

ఈ మార్గంలోని పాత ప్రభుత్వ ఆసుపత్రి నుంచి యమలింగం వరకు 4 కిలోమీటర్ల దూరం ఆయన నడుచుకొంటూ వెళ్లి తనిఖీలు చేశారు. అక్కడ జరుగుతున్న పనులపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ మార్గంలో ఇరువైపులా మొక్కలు నాటాలని, ప్రస్తుతం 11 మీటర్లుగా ఉన్న గిరి ప్రదక్షిణ మార్గాన్ని 16 మీటర్లకు పెంచాలన్నారు.

డిసెంబర్‌లో అరుణా చలేశ్వర స్వామి ఆల యంలో కార్తీక మహా దీపోత్సవం జరుగుతుం దని, ఆలోపు ఈ మార్గాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. కలెక్టరు వెంట జిల్లా రెవెన్యూ అధి కారి రత్తినస్వామి, సబ్ కలెక్టర్ ఉమామహేశ్వరి, పురపాలక కమిషనర్ పారి జాతం తదితరులు ఉన్నారు.

విజయభాను

## సంపాదకీయం

### పల్లెనిద్రతో సత్ఫలితాలు

కలెక్టరు మొదలు జిల్లాస్థాయి అధికారులు అంతా గ్రామాలు తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఉన్న సమస్యలను స్వయంగా చూసి తెలుసుకుని చేపట్టాల్సిన చర్యలను అధికారులు స్వయంగా పర్యవేక్షించే పరిస్థితి నేడు ఉన్నది. అందువల్ల ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నీ సమర్థంగా అమలు జరుగుతున్నాయి. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు చేరుతున్నాయా లేదా అన్నది గ్రామస్థాయిలో పర్యవేక్షణ ఉంటున్నది. గ్రామీణ వృత్తి జీవితాలతో ఉన్న వివిధ సామాజిక సమూహాల అభివృద్ధికి చేపట్టిన సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలవుతున్నాయి. తెలంగాణ ఆవిర్భావం నుంచి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో దేశంలోనే తనదైన ప్రత్యేకతను చాటుకున్న రాష్ట్ర ప్రభుత్వం పాలనా విధానాల్లోనూ నూతనాధ్యాయాన్ని సృష్టించింది. ఈ క్రమంలోనే ప్రజల ముంగిటకు పాలనను తీసుకెళ్లేందుకు, పాలనా సౌలభ్యం కోసం కొత్తగా 21 జిల్లాలను ఏర్పాటు చేస్తూ గతేడాది దసరా పండుగ సందర్భంగా చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నది. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం ప్రజలకు మరింత చేరువైంది. ఈ నేపథ్యంలో బుధవారం జిల్లా కేంద్రాలలో కలెక్టరేట్ల నిర్మాణానికి శంఖుస్థాపనలు జరుగుతుండటం ఓ అద్భుత ఘట్టం. ఈ నిర్మాణం చేపడుతున్న కలెక్టరేట్ భవనాలు జిల్లా పాలనా కార్యాలయాలుగానే మిగిలిపోవడంలేదు. సమీకృత కలెక్టరేట్లుగా సకల సదుపాయాలు కలిగి ఉంటాయి. జిల్లాస్థాయి ప్రభుత్వ పాలనా కార్యాలయాలన్నీ ఒకే సముదాయంలో ఉంటున్నాయి. పద్దెనిమిది జిల్లాల్లో కొత్తగా నిర్మించనున్న కలెక్టరేట్లన్నింటినీ సమీకృత పాలనా, పర్యవేక్షక, సంక్షేమ కార్యాలయాలుగా రూపుదిద్దనున్నారు. వీటి నిర్మాణానికి 1,032 కోట్లను కేటాయించడం చూస్తే వాటి ప్రాధాన్యం అర్థమవుతున్నది. సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల కలెక్టరేట్ల శంఖుస్థాపనలకు స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ వెళ్తున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఆయా జిల్లాల నుంచి ప్రభుత్వంలో మంత్రులుగా ప్రాతినిధ్యం వహిస్తున్న వారు కలెక్టరేట్లకు శంఖుస్థాపన చేస్తారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాన్ని చేపట్టి కూడా గొప్పలు పోవటమేనా అని రంధ్రాన్వేషకులు అనవచ్చు. అయితే గత పాలనలో ప్రభుత్వ కార్యాలయాల పనితీరు అంతంత మాత్రంగా ఉండేది. వివిధ కార్యాలయాలు జిల్లా కేంద్రంలో నలుమూలలా అక్కడొకటి, ఇక్కడొకటి విసిరేసినట్లుగా ఉండేవి. వాటి పనితీరు, సమన్వయ లోపం తో పాలనా నిర్వహణలో ఎదురైన ఇబ్బందులు, ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు అన్నీఇన్నీ కావు. ఇలాంటి సమస్యలన్నింటికీ పరిష్కారంగా నేడు జిల్లా పాలనా కార్యాలయాలన్నీ ఒకే సముదాయం లో ఉండేట్లు సమీకృత కలెక్టరేట్లు రూపుదిదుకోను న్నాయి. దీంతో పాలనలో వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఏర్పడుతుంది. ప్రజలు తమ పనుల కోసం వివిధ కార్యాలయాలకు తిరుగకుండా ఒకేచోట చేసుకోవచ్చు. గతంలో అయితే ప్రతి జిల్లా సగటు జనాభా సుమారు 35 లక్షలుగా ఉండేది. ఇప్పుడు పది జిల్లాల స్థానంలో 31 జిల్లా ల ఏర్పాటుతో దాదాపు పదకొండు లక్షల జనాభాకు ఒక పాలనా విభాగంగా జిల్లాలు ఏర్పాటు అయ్యాయి. వీటికి అనుగుణంగానే 25 కొత్త రెవె న్యూ డివిజన్లు, 125 కొత్త మండలాలు ఏర్పాటయ్యాయి. ఏదైనా ప్రాంతం సుస్థిరాభివృద్ధి సాధించాలంటే శాంతిభద్రతలకు ఎనలేని ప్రాధాన్యమున్నది. ఇందుకోసం ప్రభుత్వం ప్రాంతాలవారీగా ప్రజల రక్షణ, సౌకర్యార్థం నాలుగు పోలీస్ కమిషనరేట్లను, పోలీస్ సబ్ డివిజన్లను, సర్కిళ్లను, పోలీస్‌స్టేషన్లను ఏర్పాటుచేసి ప్రజల శాంతియుత జీవనానికి అండగా నిలుస్తున్నది. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యల కారణంగా రాష్ట్ర సాధనోద్యమంలో ప్రధాన ఆకాంక్షగా ఉన్న ప్రజల ముంగిట పారదర్శక పాలన ఇప్పు డు అనుభవంలోకి వస్తున్నది. జిల్లాస్థాయిలో ప్రజలకు అవసరమైన ఏ పనయినా సమీకృత కలెక్టర్ సముదాయంలో అడుగుపెట్టి సాయంత్రం కల్లా పూర్తి చేసుకొని కాగితం చేతిలో పట్టుకొని ఇంటికి ముఖం పట్టే పాలనా సౌకర్యం అందుబాటులోకి వస్తున్నది. కలెక్టరు మొదలు జిల్లాస్థాయి అధికారులు అంతా గ్రామాలు తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్నారు. క్షేత్రస్థాయిలో గ్రామాల్లో ఉన్న సమస్యలను స్వయంగా చూసి తెలుసుకుని చేపట్టాల్సి న చర్యలను అధికారులు స్వయంగా పర్యవేక్షించే పరిస్థితి నేడు ఉన్నది. అందువల్ల ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నీ సమర్థంగా అమలవుతున్నాయి. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు చేరుతున్నాయా లేదా అన్నది గ్రామస్థాయిలో పర్యవేక్షణ ఉంటున్నది.

## గాలులకు విమానం వూగిపోయింది..!

న్యూఢిల్లీ : విమానం ల్యాండ్ అయ్యే సమయంలో ఒక్కసారిగా ఉయ్యాల వూగినట్లు వూగితే.. వామ్మో..! ఇంకేముంది ప్రాణాలు పోయినట్లనిపిస్తుంది. వినడానికే భయంగా ఉంటే.. ఇక ఆ విమానంలో ఉన్న వాళ్ల పరిస్థితి ఎలా ఉంటుందో ఒక్కసారి వూహించుకోండి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్యాసింజర్ విమానంగా పేరొందిన విమానం ల్యాండ్ అవుతూ అటూ ఇటూ వూగిపోయింది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.

ప్రపంచంలోనే అతిపెద్ద విమానం ఎమిరేట్ ఎయిర్‌బస్ ఏ380 జర్మనీలోని డ్యూసెల్‌డార్ఫ్‌లో విమానాశ్రయంలో ల్యాండ్ అవుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. విమానం ల్యాండ్ అయ్యే సమయంలో భీకరమైన గాలులు వీచాయి. దీంతో విమానం ల్యాండ్ అవుతుండగా అటూ ఇటూ వూగిపోయింది. పైలెట్లు చాకచక్యంగా వ్యవహరించి ఎటువంటి ప్రమాదం జరగకుండా విమానాన్ని జాగ్రత్తగా ల్యాండ్ చేయడంతో అందరూ వూపిరి పీల్చుకున్నారు. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ వీడియోను ఇప్పటి వరకు 99లక్షల మంది వీక్షించారు.

## బాల్యమిత్రుల కోసం కాన్వాయ్‌ని ఆపిన కేసీఆర్



హైదరాబాద్ : ఆయన రాష్ట్రానికి ముఖ్యమంత్రి.. అధికారిక పర్యటనలు, సమావేశాలతో ఎప్పుడూ బిజీగా ఉంటారు.. అయితేనేం తన బాల్యమిత్రులను మరిచిపోలేదు. ఓ పర్యటనకు వెళ్తూ మధ్యలో కాన్వాయ్‌ను ఆపించి మరీ తన చిన్ననాటి మిత్రులను పలకరించారు. అంతేకాదు వారిని తన వాహనంలో ఎక్కించుకొని తనతోపాటు తీసుకువెళ్లారు. ఆయనెవరో కాదు తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్.

జిల్లా సమీకృత కార్యాలయాల శంకుస్థాపన కోసం సీఎం కేసీఆర్ సిద్దిపేట జిల్లాకు బయలుదేరారు. ములుగు వద్ద జాతీయరహదారిపై కాసేపు కాన్వాయ్‌ని ఆపి సీఎం తన బాల్య మిత్రులు జహంగీర్, అంజిరెడ్డిలను పలకరించారు. అనంతరం సిద్దిపేట పర్యటనకు వారిని తన వాహనంలో తీసుకెళ్లారు. కేసీఆర్ నుంచి వూహించని ఈ స్పందనతో ఆయన మిత్రులతోపాటు స్థానికులు, అధికారులు ఆశ్చర్యంలో మునిగితేలారు.

## చెక్‌బుక్‌లపై గడువు పెంచిన ఎస్‌బీఐ


దిల్లీ: అనుబంధ బ్యాంకుల పాత చెక్‌బుక్‌లు చెల్లబోవంటూ ప్రభుత్వ రంగ అతిపెద్ద బ్యాంకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల కీలక ప్రకటన చేసిన విషయం తెలిసిందే. అయితే, ప్రస్తుతం ఈ చెక్‌బుక్‌లపై కాస్త వెసులుబాటు కల్పించింది. పాత చెక్‌బుక్‌ల చెల్లుబాటు గడువును డిసెంబర్ 31 వరకు పొడగిస్తున్నట్లు ఎస్‌బీఐ ట్విటర్ ద్వారా బుధవారం వెల్లడించింది. ఈలోగా కొత్తవాటి కోసం దరఖాస్తు చేసుకోవాలని వినియోగదారులకు సూచించింది.

ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం లేదా సొంత బ్యాంకు బ్రాంచీల నుంచి ఈ చెక్‌బుక్‌లు తీసుకోవాలని పేర్కొంది.

ఈ ఏడాది ఆరంభంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ పాటియాలా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ బికనేర్ అండ్ జైపూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ రాయ్‌పూర్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ట్రావెన్‌కోర్‌తో పాటు భారతీయ మహిళా బ్యాంకులు ఎస్‌బీఐలో విలీనమైన విషయం తెలిసిందే.

ఈ అనుబంధ బ్యాంకుల్లోని ఖాతాదారుల వద్ద ఉన్న పాత చెక్‌బుక్‌లు సెప్టెంబర్ 30 నుంచి పనిచేయబోవని ఇటీవల ఎస్‌బీఐవెల్లడించింది. వాటి స్థానంలో కొత్తవాటి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ గడువును పొడగిస్తున్నట్లు తాజాగా ప్రకటనలో పేర్కొంది.

## కాంగ్రెస్‌కు రాష్ట్ర ప్రభుత్వం షాక్



తిరువనంతపురం : కాంగ్రెస్‌ను కుంభకోణాలు వెంటాడుతున్నాయి. కేరళ మాజీ ముఖ్యమంత్రి ఊమెన్ చాందీపై సోలార్ స్కామ్ కేసులో క్రిమినల్, విజిలెన్స్ దర్యాప్తు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. 2013లో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. చాందీ మంత్రివర్గ సహచరులు తిరువాన్‌చూర్ రాధాకృష్ణన్, అర్యదాన్ మహ్మద్, కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యేలు తంపనూర్ రవి, బెన్నీ బెహనన్‌లపై కూడా దర్యాప్తు జరగబోతోంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సోలార్ స్కామ్ కుంభకోణంపై దర్యాప్తు జరిపిన జస్టిస్ (విశ్రాంత) జి శివరాజన్ కమిషన్ సెప్టెంబరులో సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఈ కేసును వెలుగులోకి తెచ్చిన సరిత నాయర్ రాసిన లేఖ ఆధారంగా క్రిమినల్ కేసు నమోదు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. తాను లైంగిక దోపిడీకి గురైనట్లు సరిత ఆ లేఖలో ఆరోపించారు. ఆమె తనను లైంగికంగా వేధించినవారి పేర్లను ఈ లేఖలో వివరించారు.

సోలార్ స్కామ్ కేసులో సరిత నాయర్ ప్రధాన నిందితురాలు. కేరళలోని మోసపూరిత సోలార్ ఎనర్జీ కంపెనీ టీమ్ సోలార్ ఇద్దరు మహిళలను చట్ట విరుద్ధ కార్యకలాపాలకు ఉపయోగించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

ముఖ్యమంత్రి కార్యాలయంతో సహా చాలా మందితో రాజకీయ సంబంధాలు ఏర్పాటు చేసుకొనేందుకు వీరిని వాడుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. చాలా మంది పలుకుబడిగలవారిని లక్షలాది రూపాయల మేరకు మోసం చేసినట్లు కేసు నమోదైంది. వ్యాపార భాగస్వాములుగా చేసుకుంటామని కానీ, సోలార్ పవర్ యూనిట్లను ఏర్పాటు చేస్తామని కానీ నమ్మబలికి, ముందుగా డబ్బులు వసూలు చేసినట్లు అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసుపై దర్యాప్తు చేసిన అప్పటి పోలీసు ఉన్నతాధికారులపై కూడా దర్యాప్తు చేయాలని జస్టిస్ శివరాజన్ కమిషన్ సిఫారసు చేసింది.

## సమయం (కవి సమయం)

### విరాట్పురుషుని విశ్వరూపం

విరాట్ స్వరూపంలో భూత, భవిష్యత్, వర్తమాన విశ్వం అంతా కనపడుతుంది
1. ఆవరణాలు : ఇవి విరాట్పురుషుని శరీరాన్ని కప్పి ఉన్నాయి.
భూమి, నీరు, వాయువు, ఆకాశము, అహంకారము, మహత్తత్వము
యీ శరీరంలో ధారణకు ఆశ్రయమైన విరాట్పురుషుడు ప్రకాశిస్తున్నాడు
ఆ మహాత్ముని అరికాలు - పాతాల లోకం
కాలిమునివ్రేళ్లు, మడమ, చీల - రసాతలం,
మండలు - తలాతలం
పిక్కలు - సుతలం
మోకాళ్లు- వితలం, అతలం
కటి ప్రదేశం - మొలభూతలం
బొడ్డు - ఆకాశం
వక్షస్థలం - గ్రహాలు, తారకలు, నక్షత్ర లోకం
మెడ - మహర్లోకం
ముఖం - జనలోకం
శిరస్సు - సత్యలోకం
భుజదండాలు - ఇంద్రాదులు
చెవులు, దిక్కులు - శ్రోత్రం శుథం
ముక్కుపుటాలు - అశ్వినీ దేవతలు
ముక్కు - గంధం
... (సశేషం)...

...కవితా రచన
ప్రొ.అప్పాజి భగవాన్

## పంచాంగం

మాసం : అశ్వీయుజ ; తిథి : సప్తమి ఉ. 10.14
ఆరుద్ర మ. 12.56 వ.రా. 12.08ల 1.37

గురువారం
12-10-2017

**మేషం** : ఉద్యోగులకు పై అధికారుల ఒత్తిడి కలుగుతుంది. అవసరాలకు అనుకున్న సమయానికి ధనం చేతికి అందుతుంది. రాజకీయ నాయకులకు అనుకూలం. నూతన వ్యాపారములు చేయువారికి అనుకూలించును. ఆరోగ్యం బాగుంటుంది. పాత సన్నిహితులను కలుసు కుంటారు. **వృషభం** : దూర ప్రయాణములు చేస్తారు. దర్ఘీరోగులు మాత్రం జాగ్రత్త అవసరం. పెద్దల సహకారం కలుగును. శరీర ఒత్తిడి అలసట ఎక్కువగా ఉంటుంది. నిరుద్యోగులకు ఉపశమనం కలుగుతుంది. పెద్దల సహకారం కలుగును. **మిథునం** : దూరపు బంధువులతో ఇష్టాగోష్ఠి చేస్తారు. నూతన సినీ రంగంలో ప్రవేశించు వారికి గుర్తింపు కలుగుతుంది. విందు, వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం బాగుండును. **కర్కాటకం** : వృత్తి వ్యాపారాలు చేయువారు ముఖ్యమైన నిర్ణ యాలు తీసు కుంటారు. ఆధ్యాత్మిక, దైవ, సేవా కార్యక్రమాలపట్ల ఆసక్తి పెరుగుతుంది. మీ బాధ్యతలు ఇతరులకు అప్పగించవద్దు. ఎంత సంపాధించినా ధనం నిలబెట్ట లేకపోతారు. మీ ప్రత్యర్థుల విష యంలో అప్రమత్తంగా మెలగండి. సహోద్యోగులు మనసు తెలిసి వ్యవహరిస్తారు. **సింహం** : ఆర్థిక విషయాలలో ప్రోత్సాహకరంగా వుంటుంది. కష్టమైన పనులన్నింటిని దిగ్విజయంగా పూర్తిచేస్తారు. ఉద్యోగస్తులు ఒత్తిళ్ళు, ప్రలోభాలకు దూరంగా ఉండటం మంచిది. కుటుం బీకులు మీ అభిప్రాయాలతో ఏకీభవిస్తారు. కొబ్బరి, పండ్ల, పూల, కూరగాయలు, చిరు వ్యాపారులకు పురోభివృద్ధి. **కన్య** : బంధుమిత్రులను కలుసుకుంటారు. కొత్త పరిచయాలు ఏర్పడతాయి. మీ మనస్సుకు ఆనందం కల్గించే పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఆర్థికంగా లాభం. ప్రియతముల వైఖరిలో మార్పు, ఆనం దం కలుగుతుంది. **తుల** : బంధువుల ఆకస్మిక రాక మీకు ఎంతో ఆశ్చ ర్యానికి గురి చేస్తుంది. ఏదన్న అమ్మకానికి చేయు ప్రయత్నాలలో సఫలీకృతులు కాగలరు. నిరుద్యో గులకు సదవకాశాలు లభించినప్పటికిని వాటిని సద్వినియోగం చేసుకొలేకపోతారు. ఓర్పు పట్టుదలతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. పొదుపు ఆవశ్యకతను గుర్తిస్తారు. **వృశ్చికం** : రిటైల్, రియల్ ఎస్టేట్ రంగాల వారు కీలక నిర్ణయాలు తీసుకుంటారు. కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడుపుతారు. మీరు మార్పు కోసం ఆరాటపడతారు. కొత్త ఆలోచనలు మీ మదిలో మెదులు తుంటాయి. **ధనుస్సు** : బ్యాంకు వ్యవహారాలలో అపరిచిత వ్యక్తులపట్ల అవ సరం. పెద్దల ఆరోగ్యము గురించి ఆందోళన చెందుతారు. గృహమునకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. ప్రైవేటు సంస్థలలోని వారికి పనిభారం అధికమవుతుంది. **మకరం** : వృత్తి వ్యాపారాలకు సంబంధించి ముఖ్యమైన నిర్ణయాలు తీసు కుంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్ల ధోరణి ఆందోళన కలిగిస్తుంది. మిత్రులను కలుసుకుంటారు. సోదరీ, సోదరులతో ఏకీభవించలేరు. ఉద్యోగస్తులు అధికారులతో సంభాషించు నప్పుడు మెళుకువ అవసరం. **కుంభం** : బ్యాంకుల ఆర్థిక సంస్థలతో వాయిదా పడతాయి. స్త్రీలు టి.వి.ఛానెళ్ళ కార్యక్రమాల్లో రాణి స్తారు. విద్యార్థుల్లో మనోధైర్యం, ఏకాగ్రత నెలకొంటాయి. దూర ప్రయాణాలు, పుణ్యక్షేత్రాల సందర్శ నలకు పథకాలు రూపొందిస్తారు. మీ అలవాట్లు, బల హీనతలు గోప్యంగా ఉంచటం క్షేమదాయకం. ఖర్చులు పెరిగే ఆస్కారం ఉంది. **మీనం** : వృత్తి పరమైన సమా వేశాలకు అను కూలం. లక్ష్యసాధనకు మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. న్యాయ, బోధన కళారంగాలవారికి శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది. రుణయత్నాల్లో స్వల్ప ఆటంకాలు ఎదుర్కొంటారు.

## శుభ ఫలితాలనిచ్చే సుబ్రమణ్యస్వామి

సంకీర్తన



ఒకే శరీరంలో ఆరుముఖాలు పన్నెండు చేతులు గల కార్తికేయునికి సహాయకులుగా పార్వతిదేవి నూపురం నుంచి తొమ్మిది మంది వీరులు జనించారు. వీరబాహు, వీరకేసరి, వీర మహేంద్ర, వీర మహేశ్వర, వీర పురంధర, వీర రాక్షస, వీర మార్తాండ, వీరాంతక, వీర ధీర అని వారిని పిల్వడం జరుగుతోంది. విష్ణు ఆదేశం మేరకు శివుడు ఆ బాలుని నుంచి ప్రణవోపదేశం పొందాడు. ఆ కారణంగా సుబ్రహ్మణ్యేశ్వరుడికి, శివగురు, స్వామినాథ, దేశిక అనే పేర్లు వచ్చాయి. కుమారస్వామి ఇంద్రుని కుమార్తె అయిన దేవయానిని, శివమూర్తి కుమార్తె వల్లీదేవిని వివాహమాడాడు. అలాగే ఆ స్వామి నెమలిన తన వాహనంగానూ, కోడి పుంజును తన ధ్వజంగానూ చేసుకున్నాడు. ఆ కారణంగా స్వామి శిఖివాహనుడు, కుక్కుట ధ్వజుడయ్యాడు. సుమ్రహ్మణ్యేశ్వ రుడి ధ్వజమందు కోడి పుంజు ఉంటుంది. కో అనే ధ్వని ప్రణవమును సూచిస్తుంది. జ్ఞాన భానూదయము నకు ధ్వని సంకేతం. అలాగే స్వామి వాహనమైన నెమలి పురివిప్పి నర్తిం చునపుడు ఓంకార రూపంలో ఉంటుంది. ఆ కారణంగా స్వామిని ప్రణవ స్వరూపుడిగా చెబుతారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని సేవించే సమయంలో ఉరగేశ్వ రాయనమః మహోరణాయనమః అని కీర్తించడం జరుగుతోంది. వల్లీదేవి స్వరూపంలో ఉన్నదని, స్వామి కూడా సర్ప రూపంలో ఉంటాడని పురాణాల ద్వారా అవగతమవుతోంది.తెలుగు రాష్ట్రాలలో సుబ్రహ్మణ్య షష్టి పర్వ దినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపు కుంటారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు ఈ పర్వదినం రోజున స్వామికి ఘనంగా పూజలు నిర్వహిస్తారు. సుబ్రహ్మణ్య షష్టిరోజున వేకువజామునే నిద్రలేచి తలంటు స్నానం చేస్తారు. అనంతరం సుబ్రహ్మ ణ్యేశ్వ రునికి సమర్పించడానికి చిలీ (నువ్వులు, బెల్లంతో కలగలిపినది) తయారుచేసి, కొబ్బరికాయలు, అరటిపళ్ళు, పాలు, కోడిగుడ్లతో బయలుదేరుతారు. సుబ్రహ్మణ్యే శ్వరుడు సర్పాకారుడు కావడం వల్ల సమీప ప్రాంతాలలో ఉన్న పుట్టలకు చేరుకుని పుట్టను శు ద్ధిచేసి, పసుపు, కుంకుమ బొట్లు, అందమైన ముగ్గులతో అలంకరిస్తారు. అనంతరం, పాలు కోడి గుడ్లను పుట్టలలోవేసి, ప్రసాదాలను, కొబ్బరి కాయలను నివేదిస్తారు. స్వామిని భక్తితో పూజిస్తూ, భజన గీతాలు, భక్తి పాటలతో కీర్తిస్తారు. అనంతరం పుట్ట మన్నును తమ చెవులకు రాసుకుంటారు. అలా చేయడంవల్ల తమకు చెవికి సంబం ధించిన వ్యాధులు దరిచేరవని నమ్ముతారు.అలాగే మహిళా భక్తులు, పుట్టలో పాలుపోసి, పుట్ట చుట్టూ భక్తి శ్రద్ధలతో ప్రదక్షిణలు చేస్తారు. సంతాన ప్రాప్తికోసం స్వామిని మనసావాచా ఆరాధిస్తారు. పిల్లలు, స్వామికి ప్రణామాలు అర్పించి మందుగుండు సామాను కాలుస్తారు. అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే సుబ్రహ్మణ్య ఆరాధన శక్తిని, ఐశ్వర్య మహాద్భాగ్యాలను కల్గిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఆ సుబ్రహ్మణ్యే శ్వరుని అపార కృపా రసామృతం అందరిమీదా వెల్లివిరియాలని మనసావాచా అందరూ పూజిస్తారు. శివపార్వతుల తనయుడైన కుమారస్వామి గంగాదేవి గర్భంలో పెరిగాడు. ఆమె భరించ లేకపోవడంతో, ఆ శిశువు రెల్లుపొదల్లో జారిపడింది. ఆ శిశువును కృత్తికా దేవతలు ఆరుగురు స్తన్యమిచ్చి పెంచారు. జారిపడినందున ఆ శిశువునకు స్కందుడని, రెల్లుగడ్డిలో ఆవిర్భవించడంతో శరవణుడని, కృత్తికా దేవతలు పెంచడంతో కార్తికేయుడని కుమారస్వామి అని పిలు స్తారు. ఇక సుబ్రహ్మ ణ్యునికి ఉన్న ఆరుముఖాలకు ప్రత్యేకతలు ఉన్నాయి. మయూర వాహనాన్ని అధిరోహించి కేళీ విలాసాన్ని ప్రదర్శించే ముఖం, పరమేశ్వరునితో జ్ఞానచర్చలు జరిపి ముఖం, శూరుడనే రాక్షసుని వదించిన స్వరూపానికి ఉన్న ముఖం, శరణు కోరిన వారిని సంరక్షించే ముఖం, శూలాయుధ పాణియై వీరుడిగా ప్రస్ఫుటమయ్యే ముఖం, లౌకిక సంపదల్ని అందించే ముఖం ఇలా ఆరు ముఖాల స్వామిగా ఆనందదాయ కుడిగా స్వామి కరుణామయుడిగా భక్తులచే నీరాజనాలు అందు కుంటున్నాడు. అందుచేత ఆషాఢ మాస శుక్లపక్ష పంచమి, షష్టి పుణ్యదినాల్లో భక్తులు స్వామిని విశేషంగా సేవిస్తారు. వీటిని స్కందపంచమి, కుమార షష్టి పర్వదినాలు జరుపుకుంటారు. స్కంద పంచమి, షష్టి రోజుల్లో శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామిని భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తే సకల సంపదలు, సుఖవంతమైన జీవితం చేకూరుతుందని పురో హితులు చెబుతున్నారు.

ప్రధాన రహదారుల నిర్మాణంతో

# ఎలగందులకు పూర్వ వైభవం



కరీంనగర్ : పురాతన జిల్లా కేంద్రమైన ఎలగందుల తిరిగి పూర్వ వైభవాన్ని సంతరించుకోనుందని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గ్రామంలోని అంబేద్కర్ కూడలి నుంచి గూడెం వరకు రూ.3.70కోట్లతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్‌రావుతో కలిసి భూమి పూజ చేశారు. అంతకు ముందు గౌడ సంఘం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రోడ్డు నిర్మాణ విషయమై గ్రామస్తులతో చర్చించారు. దిగువ మానేరు జలాశయం నిర్మాణంతో గ్రామంలో కొంత భాగం ముంపునకు గురవడంతో ఇక అభివృద్ధి జరగదనే భావనతో చాలా మంది వూళ్లో నుంచి కరీంనగర్‌కు వెళ్లారని పేర్కొన్నారు. గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఎలగందుల పాత రోడ్డును పునర్నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. అనేక మంది అడ్డంకులు సృష్టించినా అధిగమించామని, ప్రస్తుతం వంతెన, మట్టిపనులు సాగుతున్నాయని త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఆసిఫ్‌నగర్ బస్టాండ్ నుంచి బోనాలపల్లె వరకు రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు.గ్రామంలో అంబేద్కర్ కూడలి నుంచి ఖిల్లా మీదుగా గూడెం వరకు తారు రోడ్డు నిర్మించేందుకు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. పర్యాటక ప్రాంతమైన ఎలగందుల ఖిల్లాలో సౌండ్ లైటింగ్ ప్రారంభంతో సందర్శకుల తాకిడి పెరిగిందన్నారు. రాబోయే రోజుల్లో దిగువ మానేరు జలాశయం నుంచి ఖిల్లా సమీపం వరకు బోటింగ్, జలక్రీడలకు సంబంధించిన సౌకర్యాలు అందుబాటులోకి తెచ్చే ప్రతిపాదన ఉందని, రోడ్డు నిర్మాణంతో రవాణ సౌకర్యం మెరుగుపడి భవిష్యత్తులో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గ్రామస్తులంతా చర్చించుకుని సమష్టి నిర్ణయంతో రోడ్డు నిర్మాణానికి సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయే వారికి రెండు పడక గదుల గృహాలు కేటాయిస్తామని హామి ఇచ్చారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగానే రోడ్డు పనులు చేస్తామని గ్రామస్తులు ఆందోళన చెందవద్దని కోరారు. కేటాయిస్తున్న నిధులతో అభివృద్ధి చేసుకునే బాధ్యత గ్రామస్తుల పైనే ఉందన్నారు. అంతకు ముందు తెరాస యువజన విభాగం నాయకుడు మంద రమేష్ ఆధ్వర్యంలో గ్రామంలో ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ఖిల్లా నుంచి గూడెం మీదుగా ఖాజీపూర్ శివారు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టనున్న ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ వాసాల రమేష్, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు నిమ్మల అంజయ్య, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు జువ్వాడి రాజేశ్వర్‌రావు, సర్పంచి ఎద్దండి ప్రకాశ్, ఉప సర్పంచి ఆవుల శ్రీనివాస్, దుర్శేడు సొసైటీ అధ్యక్షులు మంద రాజమల్లు, చంద్రశేఖర్‌రావు, చంద్రయ్య, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేసీఆర్ అండదండలతో అభివృద్ధిలో మేటి

సిద్దిపేట : త్వరలో సిద్దిపేట అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు అవుతుందని, అభివృద్ధిలో పట్టణాన్ని ఘనాపాటిలా తీర్చిదిద్దుతామని రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పురపాలిక కార్యాలయంలో మెప్మా, ప్రశాంతినగర్‌లో ఐకేపీ మహిళా సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రూ.315 కోట్లతో భూగర్భ మురుగు పారుదల వ్యవస్థ ఏర్పాటు చేశామన్నారు. రూ.600 కోట్లతో రంగనాయక సాగర్ నిర్మిస్తున్నామన్నారు. రూ.715 కోట్లతో ప్రభుత్వ వె%ద్య కళాశాల ఏర్పాటు అవుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అండదండలతో సిద్దిపేట అభివృద్ధిలో రాష్ట్రంలోనే మేటిగా నిలుస్తోందన్నారు. కేసీఆర్ సభకు మహిళలు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు.

## పంటల బీమా ప్రచారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం




మహబూబ్‌నగర్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పంటల బీమా పథకం రైతులకు ఎంతో ఉపయోగకరమని, ఈ పథకంపై ప్రచారం చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమయిందని భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. మహబూబ్‌నగర్‌లోని భాజపా కార్యాలయంలో జిల్లా కిసాన్ మోర్చా సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ వలస ప్రాంతంగా పేరొందిన పాలమూరు జిల్లాలో 80 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడ్డారని, ప్రస్తుతం అకాల వర్షాలతో పంటలు తీవ్రంగా నష్టపోయి రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉండడం సరికాదని పేర్కొన్నారు. గత పాలకుల మాదిరే తెరాస ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని దుయ్యబట్టారు. వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరించి రైతులకు అరచేతిలో గారడీ చూపిస్తోందని ఎద్దేవా చేశారు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించటం లేదన్నారు. భాజపా జిల్లా అధ్యక్షురాలు పద్మజారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు పెట్టుబడి రాయితీ కింద మంజూరు చేసిన కేంద్ర సహాయాన్ని రాష ్ట్రప్రభుత్వం అర్హులందరికి అందించాలని అన్నారు. కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు రంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కర్నె స్వామి మాట్లాడుతూ రైతు రుణమాఫీ అంటూ అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం రైతులను మోసగించిందని ఆరోపించారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసి ఆదుకోవాలన్నారు. నాయకులు బురుజు రాజేందర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, రమేశ్, మంతటి రాములు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే అయోవా స్టేట్ పరిజ్ఞానం గల విశ్వవిద్యాలయం

నందికొట్కూరు : అమెరికాలో ఉన్న అయోవా స్టేట్ విశ్వ విద్యాలయం ప్రపంచంలోనే అత్యంత పరిజ్ఞానం గల విశ్వ విద్యాలయం అని ఆ సంస్థ గ్లోబల్ ప్రోగ్రామ్ లీడర్‌షిప్‌నకు నేత ృత్వం వహిస్తున్న దిలీప్ అన్నారు. జూపాడుబంగ్లా తంగడంచ సీడ్‌ఫారం భూముల్లో విత్తనోత్పత్తి విశ్వవిద్యాలయం పరిశోధనా కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిలీప్ మాట్లాడుతూ ఇక్కడ వివిధ రకాల విత్తనాల తయారీతో పాటు కొత్త వంగడాలను కనుకొంటామన్నారు. అయోవాకు, ఇండియాకు సత్సంబంధం ఇప్పటిది కాదని కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతున్నాయన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీ నిరాహార దీక్ష చేసిన సమయంలో తీసుకున్న పోషకాహారాల గురించి జార్జ్‌వాషింగ్‌టన్‌కు లేఖ రాశారని అవన్నీ భద్రపరిచారన్నారు. నార్మన్‌బోర్లాగ్, ఎంఎస్ స్వామిదాస్‌లు హరిత విప్లవానికి నాంధి పలికారన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విత్తన విప్లవానికి నాంది పలకారన్నారు. యుద్ధప్రాతిపదికన విత్తనోత్పత్తి కేంద్రాన్ని పూర్తి చేసి రైతులకు మేలైన విత్తనాలు త్వరలో అందించాలని సీఎం కోరినట్లు తెలిపారు.


మూడు నెలల్లో లక్ష్యాన్ని పూర్తి చేయాలనే ఉద్దేశ్యంతో ముందుకు సాగనున్నట్లు చెప్పారు. విత్తన హబ్ నమూనాలను తెరపై ప్రదర్శించి చూపారు. ఏపీలో విత్తనోత్పత్తి క్షేత్రం ఏర్పాటు విత్తన విప్లవానికి నాంది పలుకుతుందన్నారు. అయోవా సంస్థ ప్రతినిధి మిశ్రా మాట్లాడుతూ స్థానికంగా మేలురకం విత్తనాలను తయారు చేస్తామన్నారు.


## రుణమాఫీ....రైతు బతుకు సాఫీ

నందికొట్కూరు : చంద్రబాబునాయుడు చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం తమ బతుకులను మార్చేసిందని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేశారు. తంగడంచలో సీడ్‌హబ్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సభలో వేలాది మంది రైతులు పాల్గొన్నారు. ఈసందఠరేగా ముఖ్యమంత్రి మూడో విడత రుణమాఫీ మొత్తం రూ.3000 కోట్లు, వడ్డీ కింద రూ. 600 కోట్లను చెక్కురూపంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు చంద్రబాబునాయుడుకు నాగలి బహుమానంగా ఇచ్చారు. అనంతరం ఆళ్లగడ్డకు చెందిన రైతు రమణయ్య సభావేదికపైకి వచ్చి మాట్లాడారు.

ఇప్పటికీ తాను కంది, వేరుసెనగ పంటలను సాగు చేశానని వచ్చిన దిగుబడిని కొనుగోలు చేసేందుకు ప్రైవేటు కంపెనీలు తమను ఆశ్రయిస్తున్నారని అన్నారు. తంగడంచలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విత్తనోత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులోకి వస్తాయని దీనికోసం రైతులందరూ ముఖ్యమంత్రికి రుణపడి ఉన్నామని %శ%ర్కొన్నారు. ప్రాతకోటకు చెందిన రైతు శ్రీరాములు మాట్లాడుతూ తనకు బ్యాంకులో రూ. 1.20 లక్షల అప్పు ఉండేదని పూర్తిగా మాఫీ అయ్యిందన్నారు. రెండు విడతలుగా ప్రభుత్వం అందిస్తున్న రుణం బ్యాంకులో జమ అయ్యిందన్నారు. మూడో విడత కూడా బ్యాంకుల్లో జమ అవుతుందని ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## తెదేపాతోనే రైతుల అభివృద్ధి సాధ్యం : మంత్రి నారాయణ





గూడూరు : రైతుల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని, తెదేపాతోనే రైతులకు భరోసా కలుగుతుందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ తెలిపారు. గూడూరు పట్టణంలోని డీఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో జిల్లా తెదేపా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ, బీద రవిచంద్రయాదవ్, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, జిల్లా సంయుక్త పాలనాధికారి ఇంతియాజ్‌తో కలిసి ఆయన నియోజక వర్గంలోని రైతులకు మూడో విడత రుణమాఫీ పత్రాలను అందించారు. ముందుగా మంత్రి నారాయణ, ఎమ్మెల్సీకి ఎమ్మెల్యే, తెదేపా నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఏ రాష్ట్రంలో చేయని విధంగా సీఎం రుణమాఫీ చేశారన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ ద్వారా 57.5 లక్షల మంది రైతులు లబ్ధి పొందారన్నారు. రూ.24 వేల కోట్లను రుణమాఫీ చేసిన ఘనత మన రాష్ట్రానికే దక్కుతుందన్నారు. ప్రతిపక్ష నాయకుడు వ్కెఎస్ జగన్ రుణమాఫీ రైతులకు చేరలేదని లేనిపోని ఆరోపణలు చేస్తూ రైతులను మోసగిస్తున్నారని, ఈ చర్యలు దారుణమన్నారు. రాష్ట్రం లోటు బడ్జెట్లో ఉన్నా వ్యవసాయాన్ని లాభసాటిగా అభివ ృద్ధి చేస్తే 64 శాతం మంది రైతులకు ప్రయోజనం ఉంటుందని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ ఆఖరుకు రూ.13 వేల కోట్లతో రాష్ట్రంలో 28 ప్రాజెక్టులు పూర్తి చేసేలా క ృషి చేస్తున్నామన్నారు. అన్నదాతల కళ్లలో సంతోషం చూడాలన్నదే సీఎం ధ్యేయమన్నారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదులను కలిపితే రాష్ట్రంలో రెండు కోట్ల ఎకరాల్లో వ్యవసాయం చేసే వీలుందన్నారు. ఎమ్మెల్సీ బీద రవి చంద్రయాదవ్, ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో తెదేపా చొరవతో అన్ని రంగాల్లో ముందుకు పోతున్నట్లు తెలిపారు. గూడూరు పట్టణంలో విషజ్వరాలు, సీజలన్ వ్యాధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసు కెళ్లారు. వైద్యశాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తక్షణం వైద్య సేవలు చేపట్టాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తక్షణం వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త పాలనా ధికారి ఇంతియాజ్, ఛైర్‌పర్సన్ దేవసేన, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్ మెట్టకూరు ధనంజయరెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న రుణ మాఫీని రైతులందరూ సద్విని యోగం చేసుకుని వ్యవ సాయంలో అభివృద్ధి చెందాలని కోరారు. అనం తరం రైతు లకు రుణమాఫీ పత్రాలను మంత్రి నారాయణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి ఓఎస్‌డీ పెంచలరెడ్డి, జేసీ-2 వెంకట సుబ్బారెడ్డి, ఆర్డీవో అరుణ్‌బాబు, జడ్పీటీసీ సభ్యులు పద్మ, భారతి, ఎంపీపీ రమాదేవీ, తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు, కార్య దర్శులు, తెదేపా నాయకులు, వ్యవసాయశాఖ జేడీ చంద్రనాయక్, రైతుశిక్షణ కేంద్రం ఉప సంచాలకులు శివనారాయణ, ఏడీఏలు అనిత, శివనాయక్, నర్సోజీరావు, ఉషారాణి, బాలాజీ నాయక్, ఏవో, అధికారులు తదితరులు ఉన్నారు.

# మద్యం తాగనివ్వం.. అమ్మనివ్వం..

నర్సాపూర్ : మద్యం వల్ల ఎదురవుతున్న సమస్యకు పరిష్కారం చూపాలనుకున్నారు.. నిషేధమే చక్కటి మార్గమని తలిచారు.. అంతే అందరూ ఏకమై ముందుకు వచ్చారు. గ్రామంలో మద్యనిషేధం విధించారు. వివరాలు ఇలా.. నర్సాపూర్ మండలం అహ్మద్‌నగర్ గ్రామంలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ జరిగింది. సమావేశం పూర్తయ్యాక మద్యం తాగనివ్వమని ప్రతిజ్ఞ చేశారు. గొలుసు దుకాణాలలో విక్రయాలు చేపట్టవద్దని, విక్రయిస్తే రూ.10 వేలు, గ్రామం బయట తాగి వస్తే రూ.5 వేలు జరిమాన విధించాలని తీర్మానం చేశారు. దీని అమలుకు మద్యనిషేధ కమిటీ ఏర్పాటుచేశారు. ఇందులో మహిళలే సభ్యులుగా ఉంటారు. ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్, సర్పంచి పద్మ, పంచాయతీ కార్యదర్శి పృథ్వీరాజ్, గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు రమ, సీసీ శ్రీకాంత్, సీఏ నాగరాణి ఉన్నారు.

## 13న అధికార భాషా సంఘం సమావేశం

ఒంగోలు : ఈ నెల 13వ తేదీ అధికార భాషా సంఘం సమావేశం నిర్వహించనున్నట్లు డీఆర్వో డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి తెలిపారు. స్థానిక సీపీవో సమావేశం మందిరంలో జరిగే ఈ సమావేశానికి కలెక్టర్ వినయ్‌చంద్ హాజరవుతారన్నారు. తెలుగు అమలుపై సమీక్షిస్తారన్నారు. జిల్లా అధికారులు తగిన నివేదికలతో హాజరుకావాలని కోరారు.

## ఉద్యోగ మేళాకు విశేష స్పందన

### 45 మందికి ఉద్యోగ అవకాశాలు

ఒంగోలు : రాష్ట్ర నైపుణ్యాభివ ృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. ఒంగోలు లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం పోర్టు, శంషాబాద్‌కు చెందిన క్రిష్టల్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, తడ శ్రీసిటీకి చెందిన వీర్ మొబైల్ సంస్థలు పాల్గొ న్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 102 మంది నిరుద్యోగ యువతీ యువకులు ముఖాముఖీకి హాజరయ్యారు. 45 మందికి ఉద్యోగాలు లభించినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజరు షేక్ మీరావళి తెలిపారు. కృష్ణపట్నం పోర్టుకు 27 మంది, క్రిష్టల్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు 16 మంది, వీర్ మొబైల్ సంస్థకు ఇద్దరు ఎంపికైనట్లు వెల్లడించారు. స్కిల్ కనెక్ట్ పోగ్రాం కార్యక్రమంలో భాగంగా ప్రతి రెండు వారాలకు ఒక సారి నిరుద్యోగ యువకులకు ఉద్యోగ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని ప్రైవేటు పరిశ్రమల్లో నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమన్నారు.

నాణ్యమైన విత్తనంతో పాటు

## ఆరోగ్యం బాగుండాలన్నదే సీఎం లక్ష్యం

నందికొట్కూరు : రైతుకు నాణ్యమైన విత్తనం అందించడమే కాకుండా ఆ విత్తనం ద్వారా తయారైయ్యే ఆహారం కూడా ఆరోగ్యకరంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ధ్యేయమని వ్యవసాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్ అన్నారు. తంగడంచలో సీఎం సీడ్‌హబ్ ప్రారంభోత్సవ సభలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు ఏ ప్రాజెక్టు ప్రారంభించినా ఏడు తరాల ప్రజలు గుర్తుండిపోయేలా చేస్తారన్నారు. జూన్ 2న జరిగిన నవనిర్మాణదీక్షల్లో హ ృదయంపై చేతులు పెట్టి ప్రమాణం చేయించి కరవు నివారణ రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని చెప్పారని ప్రస్తుతం అది నిజమయ్యిందన్నారు. రాష్ట్రంలో లక్ష ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం సాగుతుండడం చాలా గర్వంగా ఉందన్నారు. కలసి కష్టపడదాం, మంచివ్కెపు సాగుదాం, ఆంధ్రరాష్ట్రాన్ని వ్యవసాయం వైపు తీసుకెళ్దామని చెప్పారు.

రామలింగేశ్వరుని తాకిన

## భానుని కిరణాలు



జరుగుమల్లి : మండలంలోని నర్శింగోలులో ప్రసిద్ధి గాంచిన గంగా పార్వతీ సమేత రామ లింగేశ్వరస్వామి దేవ స్థానంలో స్వామి వారిని సూర్యకిరణాలు తాకాయి. పది నిముషాల పాటు సూర్య కిరణాలు తాకడంతో గ్రామస్థులు, భక్తులు అధిక సంఖ్యలో దేవ స్థానానికి చేరుకొని స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రధాన అర్చకుడు జంధ్యాల చంద్ర భాస్కరశాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృత, ఫలామృత అభిషేకాలు నిర్వహించారు. పార్వతీదేవికి కుంకుమార్చన చేశారు.

## విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం నింపాలి

### డీఈవో బి.విజయభాస్కర్

ఒంగోలు : విద్యార్థుల్లో చిన్నతనం నుంచే ఆత్మవిశ్వాసం పెంపొందేలా పాఠ్యాంశాల బోధన సాగాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖాధికారి బి.విజయభాస్కర్ అన్నారు. ఆనంద లహరి అభ్యసన కార్యక్రమంపై ప్రాథమిక పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు అయిదు రోజులపాటు నిర్వహించనున్న శిక్షణ శిబిరం ఒంగోలు సర్వశిక్ష అభియాన్ సమావేశ మందిరంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో డీఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రిషి వ్యాలీలో విద్యా బోధనకు అవలంబిస్తున్న పద్ధతు లను ప్రతి ఉపాధ్యాయుడు ఆచరించాలన్నారు. విద్యార్థులకు బోధించేది ఏదైనా దృశ్య రూపకంలో ఉంటే త్వరగా అర్థం చేసుకుంటారన్నారు. భవిష్యత్తులో అన్ని పాఠశాలలకు ట్యాబ్‌లు అందజేస్తామన్నారు. సహనాన్ని కోల్పోయి చిన్నారులను కొట్టి భయ పెట్టవద్దని, పిల్లలతో కలిసి అన్ని విషయాలు ముచ్చటించాలన్నారు. వారిలోని ఆసక్తిని గమనించి.. వారిని ఆ దిశగా ప్రోత్సహించాలన్నారు. శిక్షణ కార్యక్రమం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ జరుగుతుందన్నారు.

### జాతీయస్థాయి పోటీలకు గురుకులం విద్యార్థి

చిల్లకూరు : చిల్లకూరు గురుకుల పాఠశాల చెందిన ఎం.వంశీకృష్ణ అనే విద్యార్థి జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు అండర్-19 విభాగంలో ఎంపికైనట్లు ప్రిన్సిపల్ చంద్రకళాదేవి తెలిపారు.

## కంప్యూటర్ టీచర్ల నియామకానికి విద్యాశాఖ కసరత్తు



డోన్ : రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ సిబ్బంది లేకపోవడంతో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నట్లు పశ్చిమ రాయలసీమ నియోజకవర్గ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 4,500 ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ టీచర్ల నియామకానికి విద్యాశాఖ కసరత్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన డోన్ పట్టణంలోని ఐటీఐతో పాటు ఆదర్శ పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీ, గురుకుల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నత పాఠశాలల్లో పాతకాలం నాటి రోనియో మిషన్ ఆపనేటర్లు తదితర 21 పోస్టుల స్థానంలో కంప్యూటర్, ల్యాబ్, గ్రంథాలయం వంటి పోస్టులను నియమించాలని విద్యాశాఖ మంత్రికి చేసిన ప్రాతినిధ్యం మేరకు తీవ్రంగా కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 163 ఆదర్శ పాఠశాలలను విద్యాశాఖలో విలీనం చేసి వేతనాలను చెల్లించడానికి సీఎం ఆమోదం కోసం విద్యాశాఖ ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. సాంఘిక, సంక్షేమ గురుకులాల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రధానాచార్యులు, పర్యవేక్షణాధికారి పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్జీటీలకు, యూపీ పాఠశాలల్లో పనిచేసే ఎస్ఏలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని ఎన్నికల కమిషన్‌కు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించినట్లు చెప్పారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడి పోస్టును మంజూరు చేయాలన్నారు. ఈ సందఠరేగా ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఇ.షణ్ముర్తి మాట్లాడుతూ పదో పీఆర్సీ వేతన కమిషన్‌ను వెంటనే నియమించాలని, పీఆర్సీ బకాయిలను, రెండు విడతల డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్ రద్దుకు కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ప్రసాదరెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ మౌలాలి, జిల్లా నాయకులు జి.వి.రమణ, నాగరాజు, ఇక్బాల్‌బాషా, జి.మద్దిలేటి పాల్గొన్నారు.

### సమన్వయంతో గ్రామాల అభివృద్ధి

అర్థవీడు : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయ సహకారంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ రవికుమార్ యాదవ్ అన్నారు. అర్థవీడు మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సంక్షేమ పథకాలు, అభివ ృద్ధి ఫలాలు అర్హులకు అందాలని కోరారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్యలను మెరుగుపరచాలన్నారు.

# ఏకాగ్రతకు ఏం చేస్తున్నారు?

ఏదైనా పనిచేసేటప్పుడు ఏకాగ్రత కోల్పోతున్నారా ? ప్రతిసారీ.. మీరు చేసే పనిలో కాన్సంట్రేషన్ మిస్ అవుతున్నట్టు గమనిస్తున్నారా ? ఏకాగ్రత కుదరకపోవడం వల్ల.. మీకున్న టాస్క్‌లు పూర్తి చేయలేకపోతున్నారా ? అయితే.. దానికి కారణాలు ఖచ్చితంగా తెలుసుకోవాల్సిందే. మీ ఏకాగ్రతను నాశనం చేస్తున్నదేంటో ఒక్కసారి చూడాలి.

ఏకాగ్రత కోల్పోతే.. మీరు చేసే పనిలో క్వాలిటీ తగ్గిపోతుంది. చేసే పనిలో ఫోకస్, శ్రద్ధ ఉంటేనే.. అది సక్సెస్ అవుతుంది. ఉదాహరణకు మీకు ఏకాగ్రత తగ్గినప్పుడు ఎగ్జామ్స్‌కి లేదా టెస్ట్‌లకు చదవడం కూడా కష్టమవుతుంది. దీనివల్ల ఫలితాలు తారుమారు అవుతాయి. ఇది ఎడ్యుకేషన్ పైనా ద్రుష్ప్రభావం చూపుతుంది. ఏకాగ్రత తగ్గిపోతే.. మీ పనిచేసే ఆఫీస్‌లోకూడా రిలేషన్స్ తగ్గిపోతాయి. మీకిచ్చిన టాస్క్‌లు పూర్తిచేయకపోతే మీపై దురభిప్రాయం ఏర్పడుతుంది. అలాగే మిమ్మల్ని ప్రేమించే వ్యక్తి చెప్పే మాటలను శ్రద్ధగా వినలేకపోతే.. వాళ్ల ప్రేమను మిస్సవ్వాల్సి వస్తుంది. కాబట్టి.. ఏకాగ్రత అనేది జీవితంలో చాలా ముఖ్యమైనది. ఏకాగ్రత కోల్పోవడానికి చాలా కారణాలుంటాయి. మీ ఉద్యోగం, అలసట, అనారోగ్య సమస్యలు కూడా ఏకాగ్రత కోల్పోవడానికి కారణమవుతాయి. కాబట్టి.. ముఖ్యంగా ప్రతి ఒక్కరిలో ఏకాగ్రత కోల్పోవడానికి కొన్ని ప్రధాన కారణాలున్నాయి. వాటిని ఒక్కసారి చూడటం వల్ల.. ఏకాగ్రత మిస్ అవకుండా.. జాగ్రత్త పడవచ్చు. ఎక్కువగా సోషల్ మీడియా ఉపయోగించడం ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నారు. కొత్త కొత్త అప్ డేట్స్, ఇంట్రెస్టింగ్ ఇన్ఫర్మేషన్ అందించడం ఇలా.. రకరకాలుగా.. ప్రయత్నిస్తూ.. వాళ్లు ఏకాగ్రతను మొత్తం సోషల్ మీడియాలో పెడుతూ.. వర్క్, స్టడీస్ మీద పెట్టడం లేదు. పదే పదే ఫోన్లను చూస్తూ ఉండటం వల్ల.. సోషల్ మీడియా అప్ డేట్స్, సెల్ఫీలు పోస్ట్ చేయడం వల్ల.. మీ కాన్సంట్రేషన్ లెవెల్స్ చాలా త్వరగా తగ్గిపోతున్నాయి. ఒక్కోసారి ఆకలి కూడా.. ఏకాగ్రత లెవెల్స్ తగ్గించడానికి కారణమవుతుంది. తరచుగా ఆకలివేయడం, ఏమీ తినకపోవడం వల్ల మీ ఏకాగ్రత డైవర్ట్ అవుతుంది. మళ్లీ ఆకలిగా అనిపిస్తుంది. దీనివల్ల ప్రస్తుతం చేస్తున్న పనిపై ఏకాగ్రత పెట్టలేకపోతారు. కాబట్టి మిమ్మల్ని మీరు ఏకాగ్రత కోల్పోకుండా ఉండాలంటే.. హెల్తీ ఫుడ్ తీసుకోవాలి. దీనివల్ల ఏకాగ్రత కావాల్సినంత ఉంటుంది. డిప్రెషన్ డిప్రెషన్ లేదా అత్యంత ఎక్కువ ఒత్తిడి, ఆందోళన కాన్సంట్రేషన్ కోల్పోవడానికి కారణమవుతుంది. మైండ్ ఎప్పుడు ఆలోచనలతో నిండిపోతే.. లేదా ఒత్తిడికి గురవుతూ ఉంటే.. ఏ పనిశ్రద్ధగా చేయలేకపోతారు.

ఎప్పుడూ ఏదో కోల్పోయిన ఫీలింగ్ వెంటాడుతుందే తప్ప చేసే పనిలో ధ్యాస పెట్టలేకపోతారు. డిప్రెషన్ వల్ల బాధగా ఉండటం, ఆసక్తికోల్పోవడం వంటి వన్నీ.. ఏకాగ్రత కోల్పోవడానికి కారణమవుతుంది. కాబట్టి.. ఏకాగ్రత కోల్పోతున్నారని గ్రహించిన వెంటనే.. తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. పైన చెప్పిన వాటికి దూరంగా ఉంటే.. ఏకాగ్రత సరిగా కుదురుతుంది.

# 'చక్కెర' వ్యాధికి చవకైన మందు!



బెంగళూరు: టైప్-2 మధుమేహ వ్యాధి చికిత్స కోసం శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధక మండలి(సీఎస్ఐఆర్) కొత్తగా ఆయుర్వేదిక్ యాంటీబయోటిక్ ఔషధం బీజీఆర్-34ను అందుబాటులోకి తెచ్చింది. ఈ ఔషధం రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రణలో ఉంచి, శరీరంపై ఇతర ఔషధాల దుష్ప్రభాలను తగ్గింస్తుందని నేషనల్ బొటానికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(ఎన్‌బీఆర్ఐ) శాస్త్రవేత్త ఏకేఎస్ రావత్ తెలిపారు. లక్నోలోని ఎన్‌బీఆర్ఐ, సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మెడిసినల్, అరోమాటిక్ ప్లాంట్స్(సీఐఎంఏపీ) సంస్థలు సంయుక్తంగా ఈ ఔషధాన్ని అభివృద్ధిచేశాయి. కర్ణాటక సహా సరిహద్దు రాష్ట్రాలో 5 రూపాయలకే దీన్ని ఆయుర్వేదిక్ ఫార్మా సంస్థ ఏఐఎంఐఎల్ ముందుకు వచ్చింది. కస్తూరి పసుపు, ఏగిస, తిప్పతీగ, మంజిష్ట, పాడపత్రి, మెంతులు తదితరాలపై క్షుణ్ణంగా అధ్యయనం చేసి ఈ ఔషధాన్ని తయారుచేశారు.




# సహజంగానే బరువును తగ్గించుకోవాలి



ప్రకృతికి అనువైన జీవన విధానాన్ని అనుసరిస్తే ఆరోగ్యం వుండటం సాధ్యం. కనుక ప్రకృతిలో దొరికే పండ్లు, కూరగాయలు వంటి తాజా ఆహారం తీసుకోవడం ఉత్తమంగా ఏ చెబుతారు. మనిషి కోసం ఆహారం కాదు ఆహారం కోసం మనిషని అంటారు. నిల్వ వున్న ఆహారం, క్రిమి సంహారకాల్ని కలిపే శీతల పానీయాలు మనిషికి అవసరమా? మన వాతావరణానికి తగని ఆహారం తీసుకోవడం ఎంతవరకు సబబు? వీటన్నిటి గురించి ఆలోచించాలి. పాఠశాలల్లో, కళాశాలల్లో వ్యాయామం లేదు, ఆటలు లేవు. మరోవైపు త్వరగా లావెక్కడానికి కారణమయ్యే జంక్‌ఫుడ్ తినడం పెరిగింది.

విందు వినోదాల పేరిట బిర్యానీలు, కూల్‌డ్రింక్స్ కలిపి లాగించే యువతీయువకుల్ని చూస్తున్నాం. కనుక పిల్లలు, ఇరవై దాటని యువతీయువకులు సైతం అధికబరువు సమస్యతో బాధపడుతున్నారు. ప్రతి రోజూ ఎనిమిది గ్లాసుల నీటిని సేవించండి. మీరు తీసుకునే టీ, కాఫీ, జ్యూస్‌లలో చక్కెర శాతాన్ని తగ్గించుకోండి. చిన్న కప్పుల్లో (ఐదు నుంచి ఆరు) అన్నం తీసుకోండి లేదా స్నాక్స్ తీసుకుంటుండండి. ప్రతి రోజు నడక తప్పనిసరి. ఇంటి బయట, షాపింగ్‌కు వెళ్ళాలన్నా నడిచే వెళ్ళండి. రోజుకు కనీసం 45 నిమిషాలు నడవండి. దీంతో మీ శరీరంలోని క్యాలరీలు ఖర్చవుతాయి. వీలైనంత ఎక్కువగా సలాడ్‌లు తీసుకోండి. అలాగే మీ ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలుండేలా చూసుకోండి. మీకు ఆకలి వేసినప్పుడే తినేందుకు ప్రయత్నించండి. ఆకలి లేనప్పుడు తినకండి. ప్యాకేజ్ ఫుడ్ అంటే... ఫాస్ట్ ఫుడ్‌ను తీసుకోకండి. వీలె%నంతమేరకు వీటికి దూరంగా ఉండేందుకు ప్రయత్నించండి.

మీరు లిఫ్టులో పైఫ్లోర్‌లోకి వెళ్ళేటట్లయితే లిఫ్టను ఉపయోగించకుండా మెట్ల దారిలో నడిచి వెళ్ళండి. మీ ఆరోగ్యానికి ఎంతో మంచిదంటున్నారు ఆరోగ్యనిపుణులు. మీకు పండ్ల రసం తాగాలనిపిస్తే పండ్ల రసంకన్నా పండ్లను సేవించండి. ప్రకృతి పరంగా లభించే కూరగాయలన్నీ సమయానుసారం ఆహారంలో ఉండేలా చూసుకోండి. ముఖ్యంగా రాత్రపూట కేవలం కూరగాయలతో చేసిన సలాడ్ మరియు మొలకెత్తిన గింజలుండేలా చూసుకోండి. అందులోకూడా ఎక్కువగా తినకండి. తగినంత మాత్రమే ఆహారంగా తీసుకోవాలంటున్నారు వైద్యులు.

మీ కార్యాలయంలో నిత్యం కూర్చొని పని చేసేవారైతే ప్రతి రెండు గంటలకొకసారి కార్యాలయమంతా కలియ తిరగండి. అలాగే ఇంట్లో కూడా కనీసం ఐదు నిమిషాల పాటు నడ వండి. దీంతో మీ శరీ రం తేలి కగా మా రుతుంది. ప్రతి రెండు గంటలకొకసారి ఓ ఐదు నిమిషాల పాటు బ్రిస్క్ వాక్ చేయండి. తదేకంగా గంటలకొద్ది టీవీని చూడకండి. టీవీని చూస్తూ తినడం మూలాన లావు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు వైద్యులు. చాలామటుకు కొందరు శ్రమతో సంబంధం లేకుండా బతుకుతున్నారు. అవసరం కన్నా మించి తింటున్నారు. నూనెపదార్థాలు, మసాలాలు, చక్కెర పాళ్ళు ఎక్కువగా వుండే ఆహారాన్ని మితిమీరి తింటున్నారు. తరచుగా బయటి ఆహారం తీసుకుంటున్నారు. వీటన్నిటి వల్ల బరువు పెరుగుతున్నారు. వివిధరకాల వృత్తి ఉద్యోగాల్లో వున్నవారు వేళకాని వేళల్లో తింటున్నారు. రాత్రుళ్ళు మితంగా తినాలి. కానీ ఎక్కువగా తింటున్నారు. ఆ తర్వాత నాలుగు అడుగులు వేయకుండానే పడక ఎక్కేస్తున్నారు. అందుకని లావు పెరుగుతున్నారు. అధికబరువుతో బాధపడుతున్నారు. అందుకని ఆహారం విషయంలో క్రమశిక్షణ పాటించాలి. ఏం తినాలో, ఎంత తీసుకోవాలో వైద్యుల్ని సంప్రదించాలి. ఎలాంటి ఆహారం, మంచిదో ప్రకృతి వైద్యుల్ని, ఆయుర్వేద వైద్యుల్ని అడిగి తెలుసుకోవాలి. మీ వయసు, ఎత్తు, బరువు, అప్పటికే వున్న మీ ఆహారపుటలవాట్లను బట్టి వారు మీకు ఎలాంటి ఆహారం తీసుకోవాలో సూచిస్తారు. దానిని క్రమం తప్పక పాటించాలి. ఆహార పానీయాల్లో క్రమశిక్షణ తప్పకూడదు. మీ జీవన విధానంలో ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లు భాగం కావాలి.

# చిగుళ్ల వ్యాధి.. లక్షణాలు.. చికిత్స

మన దేశంలోని చాలామంది లో చిగుళ్ల జబ్బులతో బాధపడే వారు ఎక్కువ. ఈ చిగుళ్ల వ్యా ధులు ముదిరిపోయి, సమస్య పంటి ఎముక వరకూ వ్యాపిస్తే గానీ సాధారణంగా నొప్పి ఉండదు. అందుకే చిగుళ్ల వ్యాధులను గుర్తించడం అంత తేలిగ్గా సాధ్యంకాదు. అవగాహన కూడా తక్కువే. కొన్ని ప్రాథమిక లక్షణాలు ఉన్నప్పుడు చిగుళ్ల వ్యాధి ఉన్నట్లు గుర్తించి దాన్ని సరిచేసుకోవాలి. చిగు ళ్ల వ్యాధిలో రెండు దశలు ఉంటాయి అవి.

**జింజివైటిస్:**

ఈ దశలో చిగుళ్ల జబ్బు తీవ్రత అంతగా ఉండదు. చిగుళ్లు ఎర్రగా వాచి ఉంటాయి. ముట్టుకుంటే జివ్వుమంటాయి. బ్రష్ చేసు కున్నప్పుడు రక్తస్రావం కావచ్చు. అయితే మన దేశంలో సాధారణంగా ఏదో కారణంవల్లగానీ, బ్రష్ చేసుకునే సమయంలో ప్రతి ఐదుగురిల ముగ్గురికి రక్తస్రావం ఉంటుంది. పైగా జింజి వైటిస్‌ల నొప్పి ఉండదు. ఈ కారణాలవల్ల చాలా సందర్భాల్లో ఏళ్ల తరబడి ఈ వ్యాధిని గుర్తించలేని పరిస్థితి ఉంటుంది. అందువల్ల సాధారణంగా దంతవైద్యులను కలిసినప్పుడు ఈ వ్యాధి బయటపడుతుంది.


**పెరియోడాంటైటిస్:**

ఈ దశలో ఇన్ఫెక్షన్ తీవ్రత ఎక్కువగా ఉండి చిగుళ్లలో పుండ్లు ఏర్పడటం, దంతాలు దూరంగా జరిగిపోవడం, దంతాల మధ్య సందులు పెరగడం జరుగుతాయి. దీంతో శాశ్వత దంతాలు వదులుకావడం, ఊడిపో వడం కూడా జరుగవచ్చు. దంతం ఎముక వరకు వ్యాధి పాకడం వల్ల జింజివైటిస్ అన్న చిన్న సమస్య పెరియోడాంటైటిస్ దశకు చేరుకుంటుంది. కొద్దిపాటి ముందుజాగ్రత్త లతో జింజివైటిస్ దశ, పెరియోడాంటైటిస్ దశలోకి మారకుండా నివారించవచ్చు.

**వ్యాధిని గుర్తించడం (డయాగ్నోజ్) ఇలా:**

**నోటి దుర్వాసన..**

నోటి దుర్వాసన సమస్యను వైద్య పరిభాషల హెలిటోసిస్ అంటారు. దాదాపు 80 శాతానికిపైగా చిగుళ్ల వ్యాధి వల్లనే నటి దుర్వాసన వస్తుంటుంది. కేవలం 20శాతం మందిలో మాత్రమే ఇది అసిడిటీ, సైనసైటిస్, ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌వల్ల కావచ్చు. ఇది ఒక సాంఘిక సమస్య. సాధారణంగా దీనివల్ల కుటుంబ సభ్యులే ఎక్కువగా ఇబ్బందిపడ తారు. ఈ సమస్య కనిపించినప్పుడు చిగుళ్ల వ్యాధి ఉందేమనని అనుమానించి తప్పని సరిగా దంతవైద్యులను సంప్రదించాలి. పళ్లు వదులుకావడం అన్న బాహ్య




లక్షణంతో, ఒక్కోసారి పళ్లు ఊడిపోవడంతో, ఎక్స్‌రే పరీక్షతో చిగుళ్లపై తీవ్రత ఏ మేరకు ఉందో గుర్తించవచ్చు.

**లక్షణాలు:**

సాధారణంగా చిగుళ్ల వ్యాధులను ఈ కింది లక్షణాలతో గుర్తించవచ్చు.

బ్రష్ చేసినప్పుడు, ఏదైనా గట్టి వస్తువును కొరికినప్పుడు చిగుళ్ల నంచి రక్తం కారడం. నోటిలో ఎక్కువగా లాలాజలం ఊరుతున్నట్లు అనిపించడం. చిగుళ్లు క్రమంగా తగ్గిపోతున్న ట్లుగా అనిపిస్తూ, అద్దంలో చూసుకున్నప్పుడు క్రమంగా దంతాలపై నుంచి చిగురు కిందికి దిగుతున్నట్లుగా అనిపిస్తుంది. చిగుళ్లపై బుడిపెల్లా వచ్చి, అక్కడ చీము పట్టడం. నోటి దుర్వాసన వస్తుండటం.

పళ్లమధ్య సందులు రావడం, దాంతో పంటి మధ్య దూరం పెరిగి తిన్న ఆహార పదార్థాలు అక్కడ ఇరుక్కుపోవడం, అందుకే తిన్న తర్వా తప్రతిసారీ పళ్ల మధ్య సందుల్లో ఆహార పదార్థాలు చేరుతున్నాయనే అంశాన్ని గుర్తిస్తే తప్పనిసరిగా దంతవైత్యులతో పరీక్షలు చేయించుకోవడం అవసరం.

**చికిత్సలు:**

**క్యూరటాజ్...** చిగుళ్ల వ్యాధి జింజివైటిస్ అన్న ప్రాథమిక దశలో ఉంటే క్యూరటాజ్ అనే చికిత్స అవసరమవుతుంది.

**ఫ్లాప్ చికిత్స...**

చిగుళ్ల వ్యాధి జింజివైటిస్ అనే దశను దాటి పెరియోడాంటైటిస్ అనే దశకు చేరితే దానికి ఫ్లాప్ చికిత్స అవసరమవుతుంది.

**బోన్ గ్రాఫ్టింగ్...**

చిగుళ్ల వ్యాధి వల్ల పంటి ఎముక బలహీనమైపోతే దాన్ని దృఢపరచడానికి బ్రోన్ గ్రాఫ్టింగ్ అనే చికిత్స చేయాల్సి ఉంటుంది.

**నివారణ ఇలా...**

ఈ సమస్యలన్నింటినీ నివారించడానికి రోజు రెండుసార్లు ఫ్లోరైడ్ ఉన్న టూత్‌పేస్టుతో బ్రష్ చేసుకోవాలి. పళ్ల మధ్యలో బ్రష్ చేరలేని చోట ఉండే పాచిని తొలగించడానికి ఫ్లాసింగ్ (దారం వంటి దానితో పళ్ల మధ్యన ఉండే ప్రాంతంలో శుభ్ర చేయడం) చేసుకోవాలి. చక్కెర ఎక్కువగా ఉండే పదార్థాలు, పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే ఆహారాలను పరిమితంగా తీసుకోవాలి.

నోటికి అతుక్కుపోయే ఆహారాలు, శ్నాక్స్‌ను తక్కువగా తీసుకోవాలి. తందాలకు బలం చేకూర్చే సమతుల పోషకాహారం తీసుకోవాలి. సిగరెట్, ఇతర పొగాకు ఉత్పత్తులను వాడే అలవాటును పూర్తిగా మానేయాలి. పళ్లను శుభ్రం చేయడం అన్నది కేవలం బ్రషింగ్‌వల్ల మాత్రమే సాధ్యంకాదు. అందుకే రోజూ రెండు సార్లు బ్రష్ చేసినప్పటికి, రోజుకు కనీసం ఒకసారి మౌత్‌వాష్‌తో శుభ్రం చేసుకుంటే నోటిలోని బ్యాక్టీరియా పెరుగుదల అదుపులో ఉంటుంది. టూత్‌బ్రష్ అన్నది మెకానికల్ క్లీనింగ్‌కు ఉపయోగపడితే, మౌత్‌వాష్ అన్నది కెమికల్ క్లీనింగ్‌కు ఉపయోగపడుతుంది.

డెంటిస్ట్ సూచించిన షెడ్యూల్ ప్రకారం ప్రతి ఆర్నెల్లకు ఓసారి ఇంటిలోని కుటుంబ సభ్యులంతా స్కేలింగ్ ప్రక్రియ ద్వారా శుభ్రం చేయించుకోవడం అవసరం. దీనివల్ల ఎలాంటి దుష్ప్రభావాలు (సైడ్‌ఎఫెక్ట్స్) ఉండవు. పళ్లు అరిగిపోతాయన్నది, దంతాలు వదులైపోతాయ న్నది, పళ్ల మధ్య సందులు వస్తాయన్నది కేవలం అపోహ మాత్రమే.

**గుర్తుంచుకోవాల్సిన అంశం:**

చిగుళ్ల వ్యాధులు వచ్చినవారిని పరిశీలిస్తే చాలామట్టుకు కుటుంబ సభ్యులలో వంశపారంపర్యంగా ఈ వ్యాధి కనిపించే



అవకాశాలు ఎక్కువ. కాబట్టి పళ్లు వదులై పడిపోయిన కుటుంబ చరిత్ర (ఫ్యామిలీ హిస్టరీ) ఉన్నవారు తప్పనిసరిగా దంతవైద్యు డిని సంప్రదించాలి. అంతేకాదు.. చిన్న వయ సులోనే ఎవరికైనా పళ్లు ఊడిపోతే వారి పిల్లలు మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

**జాగ్రత్తలు:**

ఐదేళ్లుగా ఎప్పుడూ దంతవైద్యుడిని కలిసి ఏ రకమైన దంత వైద్య చికిత్సను తీసుకోని వారిలో చిగుళ్ల వ్యాధులు ఉండే అవకాశం చాలా ఎక్కువ. కాబట్టి మీరు ఈకోవలోకి వచ్చేవారైతే తప్పనిసరిగా దంతవైద్యుడిని కలవాలి. కేవలం దంత సంబంధమైన సమస్యలు వచ్చినప్పుడే కాకుండా ప్రతి ఆర్నెల్లకు ఓ మారు విధిగా దంతవైద్యుడితో పళ్ల పరీక్షలు చేయించుకోవాలి. ఇంట్లోని కుటుంబ సభ్యులంతా ఈ నియమాన్ని తప్పనిసరిగా పాటించాలి.

**బ్రషింగ్‌లో జాగ్రత్తలు:**

బ్రష్ చేసుకునేందుకు మృదువైన బ్రిజిల్స్ ఉన్న బ్రష్‌నే వాడండి. కిందివరసలో చిగుళ్లూ, పళ్లూ కలిసే చోటు వరకు నిలువుగా బ్రష్ చేసుకోండి. చాలా మృదువుగా బ్రష్ చేసుకోండి. రఫ్‌గా బ్రష్ చేసుకుంటే అది మీ చిగుళ్లకు హాని చేకూర్చవచ్చు. అలాంటప్పుడు అవి త్వరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. చేత్తో చిగుళ్లపై మృదువుగా మసాజ్ చేసినట్లు రుద్దితే దంతాల ఆరోగ్యం మెరుగుపుడుతుంది.

# కాల్షియం అందేలా

దంతాలు, ఎముకలు పటిష్టంగా ఉండాలంటే శరీరంలో తగిన కాల్షియం ఉండాలి. మనలో కాల్షియం తగ్గేకొద్దీ ఎముకలు బలహీనపడతాయి. పురుషులతో పోల్చినప్పుడు స్త్రీలకే అధిక కాల్షియం అవసరం అంటున్నారు నిపుణులు. మహిళల్లో వయస్సు పెరుగుతున్న కొలదీ ఎముకలు పెళుసుగా మారతాయి. దీనికి కారణం కాల్షియం కొరవడటమే. వయస్సు పెరుగుతున్నా ఎముకలు పటిష్టంగా ఉండాలంటే పాలను, పండ్లను అధికంగా తీసుకోవాలి. సి విటమిన్, కాల్షియం సప్లిమెంట్లను తతింటే శరీరానికి కాల్షియం పుష్కలంగా అందుతుంది.గోధుమలు, పాలిష్ చేయని బియ్యం, పీచుపదార్థాలు తింటే పూర్తిస్థాయిలో కాల్షియం అందుతుంది. కాల్షియం సప్లిమెంట్లను వేడి పదార్థాలతో కలిపి తీసుకోకూడదు. నిద్రపోయే ముందు, తరువాత గానీ వీటిని తీసుకోవాలి. మీ శరీరతత్వానికి తగ్గుట్టుగా ఎంత ఎంజి ఉన్న మాత్రలు వేసుకోవాలో డాక్టరును ఖచ్చితంగా సంప్రదించాలి. ఏవె%నా అతిగా తీసుకుంటే ప్రమాదమే కాబట్టి వీటిని కూడా తగిన మోతాదులోనే తీసుకోవాలి. ఒకరోజు తీసుకున్న పాలు, పెరుగు సుమారు 300 ఎంజి కాల్షియాన్ని అందించగలవు. నిమ్మజాతి పండ్లను తీసుకున్నా శరీరానికి సరిపడా కాల్షియం అందుతుంది.

# నిమ్మచెక్కలతో ఉపయోగం

పండ్లు, కాయగూరలు, గింజలు, పప్పులు, కందమూలాలు, సుగంధద్రవ్యాలు మానవుడికి ప్రక్రుతి ప్రసాదించిన అపురూప మైనవరం. ఆయా సీజన్లలో పండే పండ్లను ఆరగించడం మనకు తరతరాలుగా తెలుసును . అన్నంతో కూడా ప్రకృతిసిద్ధమైన పం డ్లు,కూరగాయలు ఇతర్రతణాధన్యాలను ఆహారంగాతీసుకునిజీవి ంచినట్లయితేశరీరానికికావససినఅన్నిరకాలపోషకాలు లభిస్తాయి . ఇదే అసలు ఉత్తమమైన జీవన విధానమని పకృతి వైద్యుల నమ్మకం. ఆహారంజీవంఉన్న ప్రతిజీవికి అత్యవసరమైనది.

పిండి పదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వుపదార్థాలు, ఖనిజలవణాలు, పీచుప దార్థాలు, రోగనిరోధక శక్తికి కావలసిన విటమిన్లు మరి యు శరీరపోషణకు రక్షణకుకావలసిన పదార్థాలనుకలిగిన ఆహా రంగా పేర్కొనవచ్చు. ఇవికాక శరీరానికి నూతన ఉత్సాహాన్నిచ్చే కాఫీ, టీ లాంటి వాటిని కూడా ఆహారపదార్థా ల కోవలోకి వస్తా యి. ఆహారం ఘన, ద్రవ రూపాలలో లభ్యం అవుతుంది. వంటింట్లో ఎక్కువగా ఉపయోగించేవి నిమ్మకాయలు.అయి తే వాటిని వాడేశాక చెక్కల్ని పడేస్తుంటారు చాలామంది. వీటివల్ల ఉపయోగాలు తెలిస్తే ఎవరూ అలా చేయరు. మరి అవేంటో మన మూ తెలుసుకుందాం.

# చిత్రభాను

వీరి వీరి గుమ్మడి పండు

# హీరోయిన్ పేరు ఏమి?



తెలుగు చిత్రసీమలో ప్రతి ఏడాది పదుల సంఖ్యలో హీరోయిన్లు అడుగుపెడుతున్నా కొత్త అందాలకు చోటు మిగిలే ఉంటుంది. కథానాయికల కొరత తెలుగు సినిమాల్లో కొత్తేమీ కాకపోయినా అగ్రనటుల సినిమాల విషయంలో ప్రస్తుతం అది ప్రధాన సమస్యగా పరిణమించింది. స్టార్‌డమ్, ఇమేజ్‌తో పాటు అన్ని పాత్రలకు సరిపోయే ప్రతిభాసామర్థ్యాలున్న కథానాయికలు తక్కువగా ఉండటంతో హీరోయిన్ల ఎంపిక విషయంలో దర్శకనిర్మాతలు మల్లగుల్లలు పడుతున్నారు. సినిమా విజయంలో హీరోయిన్ల పాత్ర కీలకం కావడం, గ్లామర్ పరంగా వారు సినిమాలకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుండటంతో కథానాయికల ఎంపిక చిత్ర వర్గాలకు పెద్ద పరీక్షగా మారింది. ప్రస్తుతం చిరంజీవి, ప్రభాస్, మహేష్‌బాబుతో పాటు పలువురు స్టార్ హీరోల సినిమాల్లో కథానాయికలు ఎవరనేది సస్పెన్స్‌గా మారింది. తమ సినిమాల కోసం హీరోయిన్లు కావలెను అంటూ దర్శకనిర్మాతలు చాలా కాలంగా అన్వేషిస్తూనే ఉన్నారు....

తొమ్మిదేళ్ల విరామం అనంతరం ఖైదీనంబర్ 150 తో చిత్రసీమలోకి పునరాగమనం చేసిన చిరంజీవి ఈ సినిమాతో పెద్ద విజయాన్ని దక్కించుకున్నారు. ఖైదీ నంబర్ 150 తర్వాత 1840 దశకంలో ఆంగ్లేయులను ఎదురించి పోరాడిన తెలుగు వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితకథలో నటించనున్నారాయన. కొణిదెల ప్రొడక్షన్స్ పతాకంపై చిరంజీవి తనయుడు రామ్‌చరణ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వ బాధ్యతలను చేపడుతున్నారు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ తుది దశకు చేరుకున్నట్లు తెలిసింది. త్వరలో చిత్రీకరణ ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కథానుగుణంగా ఈ సినిమాలో ఇద్దరు హీరోయిన్‌లకు చోటున్నట్లు తెలిసింది. వీరి కోసం చిత్ర బృందం గత కొన్ని నెలలుగా వెతుకుతున్నారు. చిరంజీవికి జోడీగా ఈ సినిమాలో ఐశ్వర్యరాయ్ కథానాయికగా నటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దర్శకనిర్మాతలు ఆమెతో సంప్రదింపులు జరిపారని, ఐశ్వర్యరాయ్ ఈ సినిమాలో నటించడానికి సముఖంగానే ఉన్నట్లు తెలిసింది. ఆమెతో పాటు అనుష్క పేరు కూడా ప్రచారంలో ఉన్నది. అభినయానికి ప్రాధాన్యమున్న పాత్ర కావడంతో అనుష్క అయితేనే ఈ పాత్రకు న్యాయం చేయగలదనే ఆలోచనలో చిత్ర వర్గాలు ఉన్నట్లు సమాచారం. దక్షిణాది నాయికలతో పాటు బాలీవుడ్ సుందరాంగులు సోనాక్షీ సిన్హా, ప్రియాంకచోప్రాలలో ఒకరు ఈ సినిమాలో నటించే అవకాశమున్నట్లు పుకార్లు వినిపిస్తున్నాయి. అయితే వీరిలో చిరంజీవితో జోడీకట్టే హీరోయిన్ ఎవరనేది చిత్రబృందం ఇప్పటివరకు అధికారికంగా వెల్లడించలేదు. త్వరలోనే ఈ ఊహాగానాలకు తెరపడనున్నట్లు తెలిసింది.

**సాహో సొగసరి కోసం...**

బాహుబలి సినిమాతో బాలీవుడ్‌తో పాటు తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో చక్కటి పేరు ప్రఖ్యాతుల్ని సొంతం చేసుకున్నారు ప్రభాస్. భారతీయ చిత్రసీమలో అత్యధిక వసూళ్లను సాధించిన సినిమాల జాబితాలో రెండవ స్థానంలో నిలిచిన ఈ చిత్రం ప్రభాస్‌కు భిన్న భాషల్లో మంచి మార్కెట్‌ను తెచ్చిపెట్టింది. దాంతో ఆయన తదుపరి చిత్రం సాహోను తెలుగు, హిందీతో పాటు దక్షిణాది భాషలన్నింటిలో విడుదల చేయనున్నారు. దాదాపు 200 కోట్ల వ్యయంతో రూపొందనున్న ఈ చిత్రంలో ప్రభాస్ సరసన నటించే కథానాయిక ఎవరనే సస్పెన్స్ ఇంకా వీడలేదు. భిన్న భాషలకు పరిచయమున్న నాయికను ఎంపికచేసే ఆలోచనతో ఉన్న చిత్ర వర్గాలు పలువురు కథానాయికలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. తొలుత బాలీవుడ్ కథానాయికలు శ్రద్ధాకపూర్, కత్రినాకైఫ్, అలియాభట్, దీపికాపదుకునే పేర్లు ప్రచారంలోకి వచ్చాయి.లోఫర్ సినిమాతో తెలుగులో అరంగేట్రం చేసిన దిశాపటానీతో చర్చలు జరిపినట్లు తెలిసింది. భారీ మొత్తంలో పారితోషికం డిమాండ్ చేయడం, డేట్స్ అందుబాటులో లేని కారణంగా బాలీవుడ్ కథానాయికలు ఈ సినిమా నుంచి తప్పుకున్నట్లు తెలిసింది. దాంతో దక్షిణాది నాయికలపై ద ృష్టిసారించిన చిత్రబ ృందం అనుష్క వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. హిట్‌పెయిర్‌గా ప్రభాస్, అనుష్కల జోడీకి గుర్తింపు ఉండటంతో ఆమెను ఈ సినిమాలో కథానాయికగా తీసుకుంటే బాగుంటుందని వారు భావిస్తున్నట్లు తెలిసింది. తాజాగా అనుష్కతో పాటు డీజే దువ్వాడ జగన్నాథం చిత్రంలో నటిస్తున్న పూజా హెగ్డే పేరు కూడా వినిపిస్తున్నది. అంతిమంగా ఈ అవకాశం ఎవరికి దక్కుతుందో తెలియాలంటే కొన్నాళ్లపాటు వేచిచూడాల్సిందే.

**శ్రీదేవి కూతురు కాదు...**

అఖిల్ కథానాయకుడిగా విక్రమ్‌కుమార్ దర్శకత్వంలో అన్నపూర? స్టూడియోస్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. విభిన్న ప్రేమకథతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ఏప్రిల్‌లో మొదలైంది. ఇప్పటికే ప్రధాన పోరాట ఘట్టాలతో పాటు సినిమాలోని కొన్ని ముఖ్యమైన సన్నివేశాల్ని చిత్రీకరించారు. ప్రస్తుతం కథానాయిక కారణంగా షూటింగ్‌కు విరామం ప్రకటించినట్లు తెలిసింది. అఖిల్‌కు జోడీగా ఈ సినిమాలో నూతన నాయికను ఎంపికచేసే ఆలోచనలో నాగార్జున ఉన్నట్లు తెలిసింది. శ్రీదేవి కూతురు జాన్వి ఈ చిత్రంతో తెలుగు చిత్రసీమలో అడుగుపెట్టనున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే నాగార్జున ఈ పుకార్లను ఖండించారు. మేఘా ఆకాష్‌తో పాటు తమిళ, మలయాళ భాషల్లో పలువురు స్టార్ హీరోయిన్స్‌ను ఈ సినిమా కోసం పరిశీలిస్తున్నట్లు తెలిసింది. హీరోయిన్ సస్పెన్స్ చిక్కుముడి వీడిన తర్వాతే తిరిగి సినిమాను మొదలుపెట్టాలనే కృతనిశ్చయంతో చిత్ర వర్గాలు ఉన్నట్లు తెలిసింది.

**హీరోయిన్ల కష్టాలు...**

ప్రేమమ్ అనంతరం నాగచైతన్య, చందూ మొండేటి కలయికలో వస్తున్న సినిమాకు కథానాయిక సమస్యలు ఎదురవుతున్నట్లు తెలిసింది. ప్రేమమ్‌లో చైతూకు జోడీగా నటించిన అనుపమ పరమేశ్వరన్‌ను హీరోయిన్‌గా తీసుకోవాలని భావించినా... ఆమె డేట్స్ అందుబాటులో లేనట్లు సమాచారం. దాంతో కొత్త నాయిక కోసం చిత్ర వర్గాలు వేట సాగిస్తున్నట్లు తెలిసింది. అల్లు అర్జున్, వక్కంతం వంశీ సినిమాకు కథానాయిక కష్టాలు తప్పలేదు. దక్షిణాది నాయికలతో దర్శకనిర్మాతలు సంప్రదింపులు జరిపినా అవి కార్యరూపం దాల్చనట్లు తెలిసింది. దాంతో ఈ సినిమాలో బాలీవుడ్ హీరోయిన్‌ను తీసుకునే ఆలోచనలో వారు ఉన్నట్లు తెలిసింది. వీటితో పాటు మరికొన్ని స్టార్ హీరోలతో పాటు నవతరం కథానాయకుల చిత్రాలు ఈ సమస్యతో సతమతమవుతున్నాయి. స్టార్ వాల్యూ, ఇమేజ్, కాంబినేషన్‌తో పాటు పలు అంశాలపై హీరోయిన్ల ఎంపిక ఆధారపడి ఉండటంతో దర్శకనిర్మాతలకు అది కత్తిమీదసాములా మారింది. తెలుగు చిత్రసీమలో కథానాయికల కొరత ఉండటంతో వారికోసం పర భాషా హీరోయినలపై ఆధారపడాల్సి వస్తున్నది. దాంతో ఆ హీరోయిన్‌లు కోట్లలో పారితోషికాల్ని డిమాండ్ చేస్తుండటంతో వారు అడిగినంత మొత్తాలను నిర్మాతలు చెల్లించక తప్పడం లేదు.

**సంఘమిత్ర ఎవరు?**

తమిళ దర్శకుడు సుందర్.సి అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కించనున్న భారీ జానపద చిత్రం సంఘమిత్ర. తమిళ, తెలుగు, హిందీ భాషల్లో దాదాపు 150 కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను రూపొందించనున్నారు. ఎనిమిదవ శతాబ్దానికి చెందిన పోరాట యోధురాలి కథాంశంతో రానున్న ఈ చిత్రంలో తొలుత శృతిహాసన్‌ను కథానాయికగా ఎంపికచేశారు. ఈ పాత్ర కోసం విదేశాల్లో యుద్ధవిద్యల్లో ప్రత్యేకంగా శిక్షణ తీసుకుందామె. శృతిహాసన్ ఫస్ట్‌లుక్‌ను కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో విడుదలచేశారు. అయితే స్క్రిప్ట్, డేట్స్ విషయంలో ఇబ్బందులు తలెత్తడంతో ఈ సినిమాను నుంచి శ ృతిహాసన్ తప్పుకుంది. ఆమె స్థానాన్ని భర్తీ చేసే కథానాయిక కోసం చిత్ర వర్గాలు కొంతకాలంగా అన్వేషిస్తున్నాయి. నయనతార, అనుష్క, హన్సికలలో ఒకరు ఈ రేసులో ఉన్నట్లు తెలిసింది. అయితే ఇతర సినిమాలతో బిజీగా ఉండటం, బాహుబలి సినిమా కోసం దాదాపు ఐదేళ్ల పాటు సమయాన్ని వెచ్చించిన అనుష్క ఇప్పట్లో మరో జానపద సినిమాలో నటించకూడదనే అభిప్రాయంతో ఉన్నట్లు తెలిసింది. హన్సిక, నయనతార సైతం రెండేళ్ల పాటు ఒకే సినిమాకు డేట్స్ కేటాయించే విషయంలో సంశయాన్ని వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

దాంతో వారు కాదంటే బాలీవుడ్ కథానాయికను ఎంపికచేయాలని భావిస్తున్న చిత్రబ ృందం దీపికాపదుకునేతో పాటు మరికొందరు హీరోయిన్లతో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. సంఘమిత్ర పాత్రకు వెండితెరపై ప్రాణప్రతిష్ట చేసే అవకాశం ఎవరికి దక్కుతుందో కాలమే చెప్పాలి.

**మహేష్‌బాబు కోసం...**

శ్రీమంతుడు తర్వాత మహేష్‌బాబు, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందుతున్నది. పొలిటికల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాకు భరత్ అనే నేను అనే టైటిల్‌ను ఖరారు చేసినట్లు తెలిసింది. ఇందులో మహేష్‌బాబు ముఖ్యమంత్రి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఈ సినిమా చిత్రీకరణ ఇటీవల మొదలైంది. అయితే ఇందులో మహేష్‌బాబు సరసన నటించే నాయిక ఎవరనే దానిపై చిత్రబ ృందం ఇంకా ఎలాంటి నిర?యానికి రానట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

డీజే దువ్వాడ జగన్నాథం చిత్రంలో కథానాయికగా నటించిన పూజా హెగ్డేను ఎంపికచేసినట్లు తెలిసింది. ఆమెతో పాటు ఎమ్.ఎస్. ధోనీ ఫేమ్ కైరా అద్వానీ పేరు ప్రచారంలో ఉన్నది. అయితే ఆ నాయిక ఎవరనేదానిపై దర్శకనిర్మాతలు త్వరలో అధికారిక ప్రకటన చేయనున్నారని తెలిసింది.

# యాక్షన్ ఆక్సిజన్

సంతోషాల్ని పంచే తల్లిదండ్రులు, నవ్వుతూ పలకరించే ప్రియురాలు..పిలిస్తే పరిగెత్తుకుంటూ వచ్చే స్నేహితుల మధ్య ఓ యువకుడి జీవితం ఆనందంగా సాగిపోతుంటుంది. అయితే ఓ రోజు జరిగిన సంఘటన అతడి జీవితంలో చీకటిని నింపుతుంది. అదేమిటి? తను కోల్పోయిన సంతోషాల్ని అతడు తిరిగి ఎలా పొందగలిగాడు? అనేది తెరపై చూడాల్సిందే అంటున్నారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం ఆక్సిజన్. ఎస్. ఐశ్వర్య నిర్మాత. ఏ.ఎం. జ్యోతిక ృస? దర్శకుడు. రాశీఖన్నా, అనుఇమ్మాన్యుయేల్ కథానాయికలు.

ఈ నెల 27న విడుదలకానుంది. నిర్మాత మాట్లాడుతూ వాణిజ్య హంగులకు ప్రాధాన్యమున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ ఇది. అత్యుత్తమ సాంకేతిక ప్రమాణాలతో రూపొందించాం. ముంబై, గోవా, సిక్కిం, చెన్నైలలో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించాం. గోపీచంద్, జగపతిబాబు నటన సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తుంది. యువన్‌శంకర్‌రాజా స్వరాలను సమకూర్చిన చిత్ర గీతాలను ఈ నెల 15న నెల్లూరులో విడుదలచేయనున్నాం అని తెలిపారు. కిక్‌శ్యామ్, అలీ, చంద్రమోహన్, నాగినీడు, బ్రహ్మాజీ, అభిమన్యుసింగ్ తదితరులు చిత్ర తారాగణం.



# నాకు నేనే క్రిటిక్‌ని!



నా నిజజీవితానికి దగ్గరగా వుండే పాత్రని రాజుగారిగది-2లో పోషించాను. సినిమాలో నా పాత్ర చిత్రణ చాలా కొత్తగా సర్‌ప్రైజింగ్‌గా వుంటుంది. రాజుగారి గది విడుదలైన సమయంలో నేను నటించిన కొలంబస్ రిలీజైంది. ఆ సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కిన రాజుగారిగది-2 చిత్రంలో నటించే అవకాశం వస్తుందని ఊహించలేదు అని తెలిపింది సీరత్ కపూర్. విజయవంతమైన రాజుగారిగది సీక్వెల్‌లో నటించే అవకాశం వస్తుందని ఊహించలేదు. దర్శకుడు ఓంకార్ రన్ రాజా రన్ చిత్రంలో నన్ను చూసి ఈ సినిమాలోని పాత్రకు నేను అయితేనే బాగుంటుందని నన్ను ఎంపిక చేసుకున్నారు. ఆయన నమ్మకానికి మించి నా పాత్రకు న్యాయం చేయడానికి ప్రయత్నించాను. చాలా కొత్త పంథాలో నా పాత్ర చిత్రణ సాగుతుంది. కథ వినిపించినప్పుడే చాలా థ్రిల్‌కు గురయ్యాను. నాగార్జునతో కలిసి నటించాలనేది నా డ్రీమ్. అది ఈ సినిమాతో నెరవేరింది. సినిమా చిత్రీకరణ సమయంలో ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. సినిమా అనేది ప్రతి ఒక్కరి డ్రీమ్ ప్రాజెక్ట్. ఈ సినిమాకు పనిచేసిన ప్రతీ ఒక్కరూ డ్రీమ్ ప్రాజెక్ట్‌లాగే భావించి కష్టపడి పనిచేశారు. అది నన్నెంతగానో ఆకట్టుకుంది. ఆ విషయాన్ని దర్శకుడు ఓంకార్‌తో చెప్పాను కూడా. సినిమాలో ఒకరి పాత్ర ఎక్కువ, తక్కువ అని కాకుండా ప్రతీ పాత్రకు ప్రాధాన్యత వుండేలా దర్శకుడు ఓంకార్ కథను తీర్చిదిద్దారు. నా పాత్రను తెరపై చూసుకుని నేను ఎంతగా సంత ృప్తి చెందానో రేపు సినిమా చూసిన ప్రేక్షకులు కూడా అంతే అనుభూతికి లోనవుతారు. కొలంబస్ తరువాత నేను బాలీవుడ్ చిత్రాల్లో నటించాలనుకుంటున్నానని, అందుకే నేను తెలుగులో సినిమాలు చేయడం లేదని ప్రచారం జరిగింది. అందులో ఎలాంటి నిజం లేదు. నాకు నచ్చిన చిత్రాల్లో నటించడానికే ఎక్కువగా ఇష్టపడతాను. కెరీర్ పట్ల నాకు పూర్తి స్పష్టత వుంది. నాకు నచ్చి అది వర్కవుట్ అవుతుంది అనిపిస్తే అంగీకరిస్తాను. నా విషయంలో నాకు నేనే క్రిటిక్‌ని. అందుకే తెలుగులో కొలంబస్ తరువాత కొంత గ్యాప్ తీసుకున్నాను. టీమ్ వర్క్‌ని నమ్ముతాను. అది రాజుగారిగది-2 చిత్ర యూనిట్ అంతా చాలా శ్రమించారు. తొలి భాగం సక్సెస్ సాధించిన విధంగానే దానికి సీక్వెల్‌గా వస్తున్న తాజా చిత్రం సూపర్‌హిట్‌గా నిలుస్తుందనే నమ్మకముంది.

## బకాయిల కోసం బీసీసీఐతో
# యువరాజ్ పోరాటం



న్యూఢిల్లీ : టీమిండియాలో స్థానం కోసం ఎదురు చూస్తోన్న సీనియర్ క్రికెటర్ యువరాజ్ సింగ్ బీసీసీఐతో సమరానికి సిద్ధపడుతున్నాడు. అయితే ఇది భారత క్రికెట్ జట్టులో చోటు కోసం కాదు. రూ.3 కోట్ల విలువైన ఐపీఎల్ బకాయిలు రాబట్టుకోవడం కోసం యువీ క్రికెట్ బోర్డును పదే పదే కోరినప్పటికీ ఫలితం లేదు. 2011 ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించిన యువీ.. విండీస్‌తో టూర్ తర్వాత జట్టులో స్థానం కోల్పోయాడు. యో-యో టెస్టులో విఫలం కావడంతో జూలై తర్వాత భారత్ తరపున ఆడే అవకాశాన్ని కోల్పోయాడు.

గత ఏడాది భారత్ తరపున ఐసీసీ వరల్డ్ కప్ ఆడిన యువీ గాయపడ్డాడు. దీంతో ఆ సీజన్లో సన్‌రైజర్స్ తరపున తొలి ఏడు మ్యాచ్‌ల్లో బరిలో దిగే అవకాశాన్ని కోల్పోయాడు. బీసీసీఐ పాలసీ ప్రకారం ఐపీఎల్‌లో ఆడుతున్న భారత ఆటగాళ్ల కాంట్రాక్టులను బోర్డు బీమా చేసింది. ఫ్రాంచైజీ తరపున ఏ ఆటగాడైనా ఆడలేకపోయినా, టీమిండియా తరపున ఆడుతూ గాయపడి మ్యాచ్‌లకు దూరమైనా.. ఆటగాడికి వాటిల్లే నష్టాన్ని బీసీసీఐ భరిస్తుంది.

తనకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరుతూ యువీ గత ఏడాదిన్నరగా పోరాడుతున్నాడు. అనేకసార్లు బీసీసీఐ అధికారులకు లేఖలు రాశాడు కానీ ఫలితం లేదు. యువీ వాళ్లమ్మ ఫోన్లు చేసినా ఉపయోగం లేకపోయింది. కానీ ఐదు మ్యాచ్‌లకు దూరమైన నెహ్రాకు మాత్రం బీసీసీఐ బకాయిలు చెల్లించింది. యువరాజ్ విషయంలో మాత్రం నోరు మెదపడం లేదు. యువీ ఇన్స్యూరెన్స్ పత్రాలు సరైన క్రమంలో లేవు, అందుకే ఇబ్బంది తలెత్తిందని బీసీసీఐ అధికారులు చెబుతున్నారు.

## లాభాల నుంచి నష్టాల్లోకి..


ముంబై : దూకుడుగా ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు, చివరికి నిరాశపడ్డాయి. ఉన్నట్టుండి ట్రేడర్లు అమ్మకాల బాట పట్టడంతో లాభాల నుంచి నష్టాల్లోకి మరలాయి.

సెన్సెక్స్ 90.42 పాయింట్ల నష్టంలో 31,833 వద్ద ముగిసింది.

నిఫ్టీ కూడా 44.65 పాయింట్ల నష్టంలో 10వేల మార్కు కిందకి పడిపోయి 9,972 వద్ద క్లోజైంది.

సెన్సెక్స్, నిఫ్టీలు రెండూ కూడా ఉదయం సెషన్‌లో మంచి లాభాలను ఆర్జించిన సంగతి తెలిసిందే.

## నేడు భూమికి సమీపంగా
# ఉల్క ప్రయాణం



న్యూఢిల్లీ : భూమికి సమీపంగా ఓ చిన్న ఉల్క గురువారం ప్రయాణించనుందని, ప్రపంచంలోని వివిధ కేంద్రాల ద్వారా దీని ప్రభావాన్ని అంచనా వేస్తామని పరిశోధకులు తెలిపారు. భూమికి 42 వేల కిలోమీటర్ల దూరంలో ఇది ప్రయాణిస్తుందని, దీని వల్ల ఎలాంటి ప్రమాదం ఉండబోదని తెలియజేశారు. 2012 టీసీ4గా నామకరణం చేసిన ఈ ఉల్క పరిమాణం 15 నుంచి 30 మీటర్లు ఉంటుందని పేర్కొన్నారు. అంటార్కిటికా ఖండానికి సమీపంగా అక్టోబరు 12న ఉదయం 11: 12 గంటల ప్రాంతంలో ఈ ఉల్క ప్రయాణించనుందని వివరించారు. ఏమైనప్పటికీ, పెరుగుతోన్న భౌగోళిక పరిశీలనా సామర్థ్యాన్ని పరీక్షించడానికి, వాటికి సంబంధించి వివిధ దృశ్యాలను సమన్వయం చేయడానికి ఇది సరైన అవకాశమని పరిశోధకులు వ్యాఖ్యానించారు.

2012లో హవాయిలోని ర్యాపిడ్ రెస్పాన్స్ సిస్టమ్, పనోరమిక్ సర్వే టెలిస్కోప్ సాయంతో ఈ ఉల్క ఉనికి గుర్తించారు. ఇది 2017లో భూమికి సమీపంగా వచ్చే అవకాశం ఉందని అప్పట్లో అంచనా వేశారు. యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ, యూరోపియన్ సదరన్ అబ్జర్వేటరీలు ఈ ఏడాది జులైలో మరోసారి దీన్ని గుర్తించాయి. ఇది భూమికి సమీపంగా వస్తున్నట్లు అంచనా వేశారు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ప్లానెట్రీ డిఫెన్స్ కో-ఆర్డినేషన్ ఆఫీస్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ స్వచ్ఛంద ప్రాజెక్టు ప్రపంచంపై ఉల్కలప్రభావం- ముందస్తు హెచ్చరిక వ్యవస్థగా మారింది. దీని సహకారంతో ప్రపంచంలోని వివిధ ప్రదేశాల్లో ఉల్కల ప్రభావాన్ని అధ్యయనం చేసి, గుర్తిస్తున్నామని ఈ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ మైఖేల్ కెల్లీ వెల్లడించారు. మరో వందేళ్ల దాకా భూమిపై ఉల్కల ప్రభావం ఉండదని ఆయన స్పష్టం చేశారు.

## కొత్తతరం నాయకులుగా ఎదగండి

- టీఆర్ఎస్ పార్టీకి భవిష్యత్ మీరే
- టీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ సమావేశంలో సీఎం కేసీఆర్



హైదరాబాద్: టీఆర్ఎస్ ప్రభుత్వానికి రాష్ట్ర అభివృద్ధి ఒక టాస్క్ అయితే ప్రతిపక్షాలకు మాత్రం ఈ అంశం రాజకీయ క్రీడగా మారిందని టీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చెప్పారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నట్లే తెచ్చుకున్న తెలంగాణను బంగారు రాష్ట్రంగా మార్చుకుందామని అన్నారు. టీఆర్ఎస్వీ విద్యార్థులు పార్టీలో కొత్తతరం నాయకులుగా ఎదుగాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి, టీఆర్ఎస్‌కు భవిష్యత్ మీరేనన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో చేపడుతున్న సాగునీటి ప్రాజెక్టులను సందర్శించి వాటిని అధ్యయనం చేయాలని ఉద్బోధించారు. తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన టీఆర్ఎస్ విద్యార్థి విభాగం (టీఆర్ఎస్వీ) రాష్ట్రకమిటీ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 2024 నాటికి రాష్ట్ర బడ్జెట్ రూ.ఐదు లక్షల కోట్లకు చేరుతుందని, ఆ నిధులతో అభివృద్ధి కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలనే లక్ష్యంతో తాము ముందుకుపోతున్నామని సీఎం కేసీఆర్ చెప్పారు. అయితే ప్రతిపక్షాలు మాత్రం అభివృద్ధిని పట్టించుకోకుండా అధికార యావతో వ్యవహరిస్తున్నాయన్నారు. రాష్ట్రానికి, తెలంగాణ రాష్ట్ర సమితికి భవిష్యత్ మీరేనని, నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని పార్టీలో ఎదుగాలని చెప్పారు.

విషయ పరిజ్ఞానం ఉన్నవారికి మంచి భవిష్యత్ ఉంటుందని, నేర్చుకోవాల్సింది సముద్రమంతా ఉందని, నిరంతరం అధ్యయనం చేయాలని అన్నారు. టీఆర్ఎస్వీ సభ్యత్వ నమోదును విజయవంతంగా పూర్తి చేసినందుకు నాయకులను అభినందించారు. రాష్ట్రంలో అత్యధిక సభ్యత్వ నమోదు ఉన్న విద్యార్థి సంఘం మనదేనని, దీంతో మనపై బాధ్యత మరింత పెరుగుతుందని చెప్పారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో, వాటి పరిష్కారంలో మీరు ముఖ్యపాత్ర పోషించాలన్నారు. సమస్యల పట్ల స్పందించే తీరే మిమ్ములను బలమైన నాయకులుగా మారుస్తుందని తెలిపారు. దశలవారీగా అన్నిస్థాయిల వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని టీఆర్ఎస్వీ నాయకులకు సూచించారు. త్వరలో రాష్ట్ర కమిటీకి, జిల్లా కోఆర్డినేటర్లకు శిక్షణా శిబిరాలు, ఆ తరువాత దశల వారీగా శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. శిక్షణా శిబిరాలకు తాను కూడా హాజరై తెలంగాణ చరిత్ర గురించి వివరిస్తానన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఇంకా కొద్దిగా కష్టపడితే వంద సీట్లను సులువుగా గెలుచుకోవచ్చునన్నారు. ఇందుకు అందరూ కష్టపడి, నిబద్ధతో పనిచేయాలని, గత పాలనకు ప్రస్తుత పాలనకు తేడా ఏమిటో ప్రజలకు వివరించాలని చెప్పారు.

### ప్రాజెక్టులను అధ్యయనం చేయండి..

తెలంగాణ ప్రజల నీటి అవసరాలను తీర్చే కీలకమైన నీటిపారుదల ప్రాజెక్టులను సందర్శించి వాటిని అధ్యయనం చేయాలని టీఆర్ఎస్వీ కార్యకర్తలకు సీఎం కేసీఆర్ ఉద్బోధించారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టుల దగ్గరికి పోయి పరిశీలించండి.. మిషన్ భగీరథ ప్రాజెక్టులో ఇన్‌టేక్ వెల్ అంటే ఏంది? ఇతర సాంకేతిక అంశాలేంది అనేది తెలుసుకోవాలె.. ప్రాజెక్టులపై అవగాహన పెంచుకోవాలన్నారు.

## కల్తీకి పాల్పడితేల ఉక్కు పాదం మోపుతాం

### డీసీపీ వి.సత్యనారాయణ

హైదరాబాద్‌: ఆహార పదార్థాల కల్తీకి పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని దక్షిణ మండలం డీసీపీ వి.సత్యనారాయణ హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు కల్తీ ఆహార పదార్థాలు తయారు చేస్తున్న కేంద్రాలపై దాడులు నిర్వహిస్తున్నామన్నారు. శ్యాంసుందర్ లోహియా కంపెనీలో సేకరించిన నూనెల శాంపిళ్లను మైసూరులోని సెంట్రల్ ఫుట్ టెక్నాలజీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపి నివేదికలు వచ్చిన తరువాత కఠిన చర్యలు చేపడతామన్నారు. నకిలీ గ్రీజ్ తయారు చేస్తున్న యూనిట్‌ను సైతం సీజ్ చేశామని దాని నిర్వాహకులపై సైతం కేసులు నమోదు చేస్తామని డీసీపీ వి.సత్యనారాయణ చెప్పారు.

## లేబుళ్ల మాయాజాలంతో నకిలీ గ్రీజ్ తయారీ

హైదరాబాద్: లేబుళ్ల మాయాజాలంతో కల్తీ నూనెను తయారు చేస్తూ వినియోగదారులకు కుచ్చుటోపీ పెడుతున్న ఓ ఆయిల్ కంపెనీ గుట్టు రట్టయ్యింది. స్వచ్ఛమైన వేరుసెనగ నూనె అంటూ ప్యాకెట్లపై వేరుసెనగ బొమ్మలు ముద్రించి లోపల చవకైన పామాయిల్, రైస్ బ్రాన్ నూనెలను నింపి మార్కెట్లకు తరలిస్తున్న వైనాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. దక్షిణ మండలం డీసీపీ వి.సత్యనారాయణ, అదనపు డీసీపీ కె.బాబురావు ఆధ్వర్యంలోని 10 పోలీసు బృందాలు పాతబస్తీ పురానాపూల్ పార్ధీవాడ పక్కన ఉన్న శ్రీ సర్వో నట్‌రాజ్ ఆగ్రో ఇండియా కంపెనీపై దాడులు జరిపి కంపెనీ బాగోతాన్ని మీడియాకు తెలిపారు. అనంతరం డీసీపీ వి.సత్యనారాయణ మీడియాకు కల్తీ నూనె, లేబుళ్ల మాయాజాలంపై వివరాలు వెల్లడించారు.

# పంచకుల అల్లర్లకు కారణం నేనే

- అల్లర్లకు ముందుగా గైడ్‌మ్యాప్‌లు- సహకరించిన డేరా శాఖలు
- విచారణలో ఒప్పుకున్న హనీప్రీత్ సింగ్



చండీగఢ్: హరియా ణాలోని పంచకు లలో జరిగిన అల్లర్ల కు తానే కారణం అని డేరా అధినేత గుర్మీత్ సింగ్ దత్త పుత్రికహనీప్రీత్ సింగ్ విచారణలో ఒప్పుకొంది. అల్లర్లకు గైడ్ మ్యాప్‌లు తయారుచేశానని ఇందుకు డేరా శాఖలు కూడా సహకరించాయని పేర్కొంది.

గతంలో హనీప్రీత్ ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచకులలో అల్లర్లకు తనకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. హనీప్రీత్ అరెస్ట్ చేసిన హరియాణా పోలీసులు ప్రత్యేక దర్యాప్తు బృందం ద్వారా విచారణ చేపట్టారు. తొలుత విచారణ సమయంలో హనీప్రీత్ పంచకుల గురించి నోరువిప్పలేదు.

అయితే ఇప్పటికే పోలీసుల కస్టడీలో ఉన్న డేరా అనుచరులు పంచకుల అల్లర్లలో ప్రధాన సూత్రధారి హనీప్రీతేనని విచారణలో వ్యక్తం చేశారు. ఇక చేసేదేంలేక హనీప్రీత్ కూడా ఈ విషయాన్ని ఒప్పుకుంది. అంతేకాదు ఈ అల్లర్ల కోసం ఆమె ఏకంగా రూ.1.25 కోట్లు ఖర్చుచేసినట్లు పోలీసులు వెల్లడించారు. హనీప్రీత్ ఇచ్చిన సమాచారాన్ని ల్యాప్‌టాప్‌లో భద్రపరిచినట్లు పోలీసులు పేర్కొన్నారు. గుర్మీత్‌కు శిక్షపడిన తర్వాత భారీ మొత్తంలో నగదును తరలించారని వాటి వివరాలు కూడా హనీప్రీత్ ల్యాప్‌ట్యాప్‌లో ఉండే అవకాశం ఉందని తెలిపారు.

ఇద్దరు సాధ్వీలపై అత్యాచారం కేసులో గుర్మీత్‌కు 20 ఏళ్ల కారాగార శిక్ష పడిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత పంచకులలో అల్లర్లు చోటుచేసుకుని 30 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ కేసులో గత వారం హనీప్రీత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. హనీప్రీత్‌కు న్యాయస్థానం 13 వరకు రిమాండ్‌ను పొడిగించింది.

# ఐటీలో అవకాశాలను ఒడిసిపడుతాం

- దిగ్గజ కంపెనీల అనుబంధ సంస్థలు సైతం హైదరాబాద్‌కు..
- రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ వెల్లడి
- హెచ్ఐసీసీలో ఇంటర్నెట్ ఓవర్ థింగ్స్,
- ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ పాలసీల ఆవిష్కరణ
- ప్రభుత్వంతో ఐదు కంపెనీల ఒప్పందం



హైదరాబాద్: ఐటీ రంగంలోని విశేష వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకునేందుకు తగిన ప్రణాళికలతో ముందుకుసాగుతున్నట్టు రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు చెప్పారు. ఇప్పటికే ప్రపంచ దిగ్గజ కంపెనీలు తమ కేంద్రాలను హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన రీతిలోనే మరిన్ని అనుబంధసంస్థలను తెలంగాణ బాట పట్టించనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఐటీశాఖ ఆధ్వర్యంలో ఇంటర్నెట్ ఓవర్ థింగ్స్, ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై పాలసీల ఆవిష్కరణ కార్యక్రమం మంగళవారం ఫిక్కీ సమన్వయంతో హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరిగింది.

సాంకేతికత స్వీకరణ, తెలంగాణ పరివర్తన శీర్షికన ఐ-తెలంగాణ 2017 పేరుతో నిర్వహించిన సదస్సులో ఇంటెల్ ఇండియా కంట్రీ హెడ్ నివృత్తిరాయ్ ఈ సందర్భంగా ఐవోటీ పాలసీని ఆవిష్కరించారు. హెవ్లెట్ పకార్డ్ ఇండియా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం అధ్యక్షుడు నరేశ్‌షా సహా అతిథులతో కలిసి మంత్రి కేటీఆర్ ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ పాలసీని ఆవిష్కరించారు. ప్రధాన ఐటీ పాలసీతోపాటు అనుబంధంగా పది పాలసీలు విడుదల చేస్తామని ఇదివరకే ప్రకటించామని, వాటిలో ఎనిమిది పాలసీలను ఇప్పటికే తీసుకొచ్చామని, తాజా గా రెండింటినీ విడుదల చేస్తున్నామని మంత్రి కేటీఆర్ వివరించారు. ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ సహా ఐవోటీ రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను అధ్యయనం చేసి వాటిని ఒడిసిపట్టుకునేందుకు ఈ రెండు పాలసీలు తెచ్చామ న్నారు. బ్లాక్ చెయిన్ నెట్‌వర్క్ ఆధారంగా తమ నూతన ప్రయత్నాలను ముందుకు తీసుకుపోతున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లో ఆపిల్, గూగుల్, అమెజాన్ వంటి సంస్థలు పెట్టుబడులు పెట్టాయని తెలిపారు.

ఫిక్కీ సెక్రటరీ జనరల్ సంజయ్‌బారు మాట్లాడుతూ హైదరాబాద్ ఇప్పుడు టెక్నాలజీ రాజధానిగా మారిందని, ప్రముఖ కంపెనీలన్నీ హైదరాబాద్‌లోనే పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంద న్నారు. దేశంలో 5జీ కనెక్టివిటీ పొందుతున్న తొలినగరం హైదరాబాద్ అని కొనియాడారు. హెవ్లెట్ పకార్డ్ ఇండియా విభాగం అధ్యక్షుడు నరేశ్‌షా మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఐటీరంగంలో సంప్రదాయ వృద్ధికి తగిన ప్రణాళికలతో ముందుకు సాగుతూనే నూతనరంగాల్లోని అవకాశాలను సైతం తన ఖాతాలో చేర్చుకునేందుకు కసరత్తు చేస్తున్నదని ప్రశంసించారు. నేడు ఇంటర్నెట్ ప్రాథమిక అవసరాల జాబితాలో చేరిందని, ఈ అవసరాన్ని గుర్తించి తెలంగాణ ప్రభుత్వం సరైన రీతిలో స్పందిస్తున్నదని హర్షం వ్యక్తం చేశారు. సైయంట్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐటీ పరిశ్రమ వృద్ధికి ప్రస్తుతమున్న నైపుణ్యాలను మరింతగా వృద్ధి చేసుకోవడం ముఖ్యమని తెలిపారు. ఇంటెల్ ఇండియా కు చెం దిన నివృత్తిరాయ్ మాట్లాడుతూ భారతదేశాన్ని మార్పు వైపు తీసుకువెళ్లే దిశగా తెలంగాణ తగినవిధంగా అడుగులు వేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా ఐదు కంపెనీలు రాష్ట్రప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. టీహబ్ సహకారంతో రూపొందించిన స్మార్ట్‌వాచ్‌ను మంత్రి కేటీఆర్ ఆవిష్కరించి, దానిని ధరించారు. కార్యక్రమంలో ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, మీ సేవ మిషనర్ జీటీ వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

### హైదరాబాద్ రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ: కేటీఆర్

భారీవర్షాలకు హైదరాబాద్‌లోని రోడ్లు దెబ్బతిన్నాయని, వాటి అభివృద్ధికి తమ ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈ నెల 15 తర్వాత ప్రత్యేక కార్యాచరణతో రోడ్ల సమస్యను పరిష్కరిస్తామన్నారు. తాను, తన కుమారుడు, ముఖ్యమంత్రి కూడా ఇదేరోడ్లపై ప్రయాణిస్తున్నామని, రోడ్లను చక్కదిద్దేందుకు స్వల్ప, దీర్ఘకాల ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.






VIJAYABHANU - Hyderabad
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published from ANH Apartments, Block-A, Flat No. 508, Bazar Ghat, Red Hills, Hyderabad-500 004. and printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003. R.N.I. No. 37754/81. Postal Regd. No. H-HD-1017/2006-08, Phone : 040 23370933, Fax : 040 66770933, Cell: 9701529570 ☆ e-mail: vijayabhanudaily@gmail.com

# కడెం జలాశయంపై సమీక్షా సమావేశం



జన్నారం : కడెం జలాశయంపై జన్నారంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. నీటి పారుదలశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్కె జోషి జలాశయం ఆయకట్టు వివరాలు తెలుసుకున్నారు. శాటిలైట్ పటంలో చూపించిన ఆయకట్టుకు, అధికారుల సర్వేకు మధ్య తేడాలున్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు. జలాయశం నీటితో వాస్తవంగా ఎన్ని ఎకరాల్లో, ఎంత పంట పండుతుందో తెలుపాలని ఆదేశించారు. అందుకోసం ఒక ఫార్మట్ తయారు చేసి దాని ఆధారంగా నీటి పారుదల, వ్యవసాయశాఖ సంయుక్తంగా సర్వేలు నిర్వహించి నివేదికలు తయారు చేయాలని సూచించారు. కొన్ని చోట్ల కాలువ నీటికి మోటార్లు అమర్చి పంటలు పండిస్తారని వాటిని సైతం జలాశయం నీటితో పండించిన పంటగానే పరిగణించాలన్నారు. జన్నారఛం, కడెం, దస్తురాబాద్, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల ఆయకట్టుకు ఎంత మేర నీటి సరఫరా అవసరం ఉంటుందో ఒక్కో మండలానికి చెందిన అధికారితో సమీక్ష నిర్వహించారు. మంచిర్యాల జిల్లా పాలనాధికారి ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ కడెం జలాశయం 1958లో ఏర్పాటు అయ్యిందని దీని కింద సుమారు 89,345 ఎకరాల ఆయకట్టు ఉంటుందన్నారు. జన్నారం మండలం కామన్‌పల్లి, దండేపల్లి మండలం నర్సాపూర్, మేదరిపేట తదితర గ్రామాల డిస్ట్రీబ్యూటరీల పరిస్థితి గురించి ఆరా తీశారు. అనంతరం ప్రొజెక్టర్ ద్వారా కడెం జలాశయం, దాని కింద ఉన్న ఆయకట్టు, పంట భూములు, బీడు భూముల గురించి అధికారిణి స్నేహ వివరించారు.

కార్యక్రమంలో కాడ కమిషనర్ మురళీధర్, నీటి పారుదలశాఖ సీఈ శంకర్, ఎస్ఈ శ్రీనివాస్, కడెం జలాశయం ఈఈ వెంకటేశ్వర్లు, డిప్యూటీ ఈఈలు, ఏఈలు, ఇన్చార్జి డీఆర్వో ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

# శ్రమను నమ్ముకుంటే విజయం తథ్యం

పాలమూరు : శ్రమను నమ్ముకున్న వారికి విజయం ఎప్పుడూ ముంగిటనే ఉంటుందని, అందుకు ఉదాహరణ తానేనని శ్రీరామ జయరామ సంస్థల ఎండీ బెక్కరి రాంరెడ్డి అన్నారు. తన తండ్రి బెక్కరి బాలకిష్టారెడ్డి పాటించిన సమయ పాలన, కష్టాన్ని నమ్ముకొని ఈ స్థాయికి వచ్చినట్లు చెపన్వారు.మహబూబ్‌నగర్‌లో శ్రీరామ జయరామ సంస్థల 43వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి మెకానిక్‌గా జీవితాన్ని ప్రారంభించారని, సుఖాలకు చిరునామా కష్టపడమేనని, ఆ కష్టాన్ని ఇష్టంగా భావించి జీవితాన్ని తాను ప్రారంభించినట్లు తెలిపారు. తమ సంస్థ రూ.300కోట్లు టర్నోవర్ సాధించిందని, ప్రస్తుతం తమ సంస్థలో 700 మందికి ఉపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు. వందలాది మంది కుటుంబాలకు ఆసరాగా నిలవడం తన జీవితంలో పూర్తి సంతృప్తిని కలిగిస్తుందన్నారు. అనంతరం ప్రతిభ కనపరిచిన సంస్థ ఉద్యోగులను సన్మానించారు. ఎస్‌బీఐ అర్బన్, రూరల్ ఆర్‌ఎంలు ఆనంద్, నాగరాజు, హెచ్‌డీఎఫ్‌సీ అధికారి విజయ్‌వర్మ, మహేంద్ర రాష్ట్ర అధికారి మహధీర్ మాధుర్, మహేంద్ర ఫైనాన్స్ అధికారి ఆంజనేయులు, ఇర్ఫాన్, మారుతి కార్ల రాష్ట్ర మేనేజర్ వంశీకృష్ణ, అరవింద్, టీవీఎస్ బాపిరాజు, సంస్థ జనరల్ మేనేజర్ సరసయ్య, మారుతి కార్ల సేల్స్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, రాజమూర్తి, రామకృష్ణ, గోవర్ధన్, వెంకట్రాంరెడ్డి, సంస్థ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# రెండు పడక గదుల ఇళ్లకు పరిపాలన ఉత్తర్వులు

### జిల్లా పాలనాధికారి బుద్ధప్రకాష్ ఎం.జ్యోతి

ఆదిలాబాద్ : జిల్లాలో నిర్మించనున్న రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాలకు పరిపాలన ఉత్తర్వులు జారీ చేయాలని జిల్లా పాలనాధికారి బుద్ధప్రకాష్ ఎం.జ్యోతి ఆదేశించారు. పాలనా ప్రాంగణంలోని ఆయన ఛాంబర్‌లో గృహ నిర్మాణం, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గానికి మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ రాజ్, పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, భవనాలశాఖ, గిరిజన ప్రాంతాల్లో గిరిజన సంక్షేమశాఖ ఇంజినీరింగ్ అధికారుల ద్వారా నిర్మాణాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 1510 ఇళ్లు కేటా యించగా, 1501 ఇళ్లకు టెండర్లు పిలవగా 1059 ఇళ్లకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని వివరించారు. 709గృహాల నిర్మాణాలు ప్రారంభించడం జరిగిందని తెలిపారు.

వీటి నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. వచ్చే సమావేశంలో గృహ నిర్మాణాలకు సంబంధించిన ఛాయా చిత్రాలు చూపించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గృహనిర్మాణసంస్థ నోడల్ అధికారి బసవేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అంతరిక్ష వారోత్సవ పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ

జ్యోతినగర్ : సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్ ఆధ్వర్యంలో రామగుండం ఎన్టీపీసీ టీటీఎస్‌లో ఇటీవల నిర్వహించిన అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా వివిధ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలను ప్రకటించి బహుమతులు అందజేశారు. 15 బృందాలు విజ్ఞాన ప్రదర్శనలిచ్చాయి. విజ్ఞాన ప్రదర్శనలో రాకెట్ ప్రయోగం(ఎన్టీపీసీ సెయింట్ క్లేర్) ప్రథమ, పరమాణు ఇంధన ప్రయోగం(జ్యోతినగర్ రావూస్) ద్వితీయ, పీఎస్‌ఎల్‌వీ-2తోపాటు రాకెట్ ప్రయోగం నమూనా(రామగుండం జిల్లా పరిషత్తు) తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. కృత్రిమ ఉపగ్రహాల పనితీరు(జ్యోతినగర్ రావూస్) నాలుగో స్థానంలో నిలవగా, ఉపగ్రహాలకు సౌరవిద్యుత్తు(ఎన్టీపీసీ సెయింట్ క్లేర్), బాటిళ్లతో ఉపగ్రహం, రాకెట్ నమూనాల ప్రదర్శన(గోదావరిఖని కృష్ణవేణి పాఠశాల)లు అయిదో స్థానం పొందాయి. క్విజ్ పోటీల్లో 829 మంది పాల్గొనగా, ఇంటర్మీడియట్ విభాగంలో సీమాకానమ్(రామగుండం ప్రభుత్వ), కేబీ.అశ్విని (ఎన్టీపీసీ సచ్‌దేవ), ఆంచల్‌కాండోయి(ఎన్టీపీసీ సచ్‌దేవ) మొదటి మూడు స్థానాలు పొందారు. డిప్లొమాలో రుచిత(కరీంనగర్ పాలిటెక్నిక్), భరత్‌కుమార్(జీడీకే సింధూర కళాశాల), వె%ష్ణవి(కరీంనగర్ పాలిటెక్నిక్) మొదటి మూడు స్థానాలు పొందగా, 10వ తరగతిలో మహేష్(గోదావరిఖని), అగర్వాల్(సెయింట్‌క్లేర్), తన్వయి(సెయింట్‌క్లేర్) మూడు స్థానాలు దక్కించుకున్నారు.

9వ తరగతిలో గోదావరిఖని విద్యాభారతికి చెందిన కావేరి, మల్లీశ్వరి, మయూరి మూడు బహుమతులు సాధించారు.

8వ తరగతిలో అఖిల్(గోదావరిఖని విద్యాభారతి), అజయ్(సెయింట్‌క్లేర్), దాక్షిణ్య(సెయింట్‌క్లేర్) గెలుపొందారు. చిత్రలేఖనం పోటీల్లో 671 మంది పాల్గొనగా, హన్వితరెడ్డి(రామగుండం కేంద్రీయ విద్యాలయం) మొదటి బహుమతి పొందింది. మైత్రి(కరీంనగర్ ఆల్ఫోర్స్), మౌరీన్(రామగుండం కేంద్రీయ విద్యాలయం), జె.సురేఖ(జ్యోతినగర్ విశ్వభారతి), కీర్తన(రామగుండం కేవీ) రెండో బహుమతిని సాధించగా, సరనేష్(కృష్ణవేణి) మూడో బహుమతిని పొందారు.

# బోధించేది ఒక్కరే.. వినేది ఒక్కరే..!!

మామడ: మామడ మండలం పాండ్య నాయక్ తండా ప్రాథమిక పాఠశాల భవనం ఇది. విశాలమైన రెండు గదులు, రెండు వరండాలతో వంద మంది విద్యార్థులకు చక్కగా చదువుకునేందుకు అవకాశం ఉంది. కానీ అక్కడ కేవలం నాలుగో తరగతిలో ఒక్క విద్యార్థి మాత్రమే ఉన్నాడు. ఆ చిన్నోడికి చదువు చెప్పేందుకు ఒక ఉపాధ్యాయురాలు ఉన్నారు. తండాకు చెందిన కొంత మంది విద్యార్థులు వసతి గృహాల్లో ఉండి చదువుకునేందుకు ఇతర గ్రామాలకు వెళ్లారు. బడి ఈడు ఉండీ అక్కడే ఉండే వారిలో ఒకరిద్దరు, బడికెళ్లే వయస్సు లేని వారిలో మరికొందరు చదువుకునేందుకు మామడ ప్రైవేటు పాఠశాలకు వెళ్తారు. ఇక ఆ తండాలో ఉన్న ప్రభుత్వ బడికెళ్లే ఒక్క విద్యార్థి కోసం ఉపాధ్యాయురాలు 3 కి.మీ నడిచి(రాను పోను 6 కి.మీ.)రావాల్సి ఉంటుంది. దూరంగా ఉన్నా కాలినడకన వెళ్లాల్సి ఉన్నా ఆమె నిత్యం బడికి క్రమం తప్పకుండా వస్తుంటుంది. మంచి ఉపాధ్యాయురాలిగా గుర్తింపు ఉంది. ఈ ఒక్క విద్యార్థి కోసం వంట చేసి మధ్యాహ్న భోజనం సైతం పెడతారు.

ఈ తండాకు సమీపంలో ఉన్న లింగాపూర్ పాఠశాలలోనూ ఇదే పరిస్థితి ఉంది. అక్కడ ముగ్గురు పిల్లల కోసం ఒక ఉపాధ్యాయుడు పనిచేస్తున్నారు.

# సీసీఐ కొనుగోళ్లతో పత్తి ధరల్లో నిలకడ: ఎమ్మెల్యే



ఖమ్మం : మార్కెట్‌లో రేటు నిలబడాలంటే సీసీఐ రంగంలో ఉండాలని ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో భారత పత్తి సంస్థ(సీసీఐ) కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఈసంవత్సరం పత్తి దిగుబడులు గణనీయంగా పెరిగే అవకాశం ఉన్నందున మార్కెటింగ్ శాఖ మంత్రి హరీశ్‌రావు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి అదనపు సీసీఐ కేంద్రాలను మంజూరు చేయించారని చెప్పారు. గత ఏడాది ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్ధతు ధరకు మించి వ్యాపారులు కొనుగోలు చేయటం వల్ల సీసీఐ కేంద్రాలు ప్రారంభం కాలేదన్నారు. ఈసంవత్సరం అధికంగా వస్తున్న పత్తిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ సీసీఐ కేంద్రాలను ప్రారంభిస్తోందన్నారు. మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రం ఉంటే రైతులకు కూడా మద్ధతు ధర వస్తుందన్న భరోసా ఉంటుందని అన్నారు. రైతులు తెచ్చిన పత్తిలో నాణ్యత సరిగా లేకుంటే రైతులకు అన్యాయం జరగకుండా సీసీఐ అధికారులు కొనుగోలు చేయాలన్నారు. తేమశాతం ఎక్కువగా ఉందని చెప్పి నిరాకరిస్తే రైతులు ఇబ్బంది పడతారని అజయ్‌కుమార్ చెప్పారు. ప్రస్తుత లక్షల రూపాయలు అప్పులు తెచ్చి వ్యవసాయం చేసిన రైతులకు గిట్టుబాటు ధర లభించకుంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతారని అన్నారు. అవిభాజ్య ఖమ్మం జిల్లాలో అతి పెద్ద మార్కెట్ అయిన ఖమ్మంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా జరగాలని సూచించారు. ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సీసీఐ మార్కెట్‌లో ఉంటే దోపిడీ తగ్గుతుందన్నారు. అదే విధంగా కొనుగోళ్లలో సమతుల్యత ఉంటుందన్నారు. రైతులకు కూడా గిట్టుబాటు ధర వస్తుందనే ఒక నమ్మకం కూడా ఉంటుందన్నారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ఆర్‌జేసీ కృష్ణ మాట్లాడుతూ పత్తి తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దిగుబడులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున కేవలం మార్కెట్లోనే కాకుండా పరిసర ప్రాంతాల్లోని జిన్నింగు మిల్లుల్లో కూడా సీసీఐ ద్వారా కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. సీసీఐ నిబంధనలకు లోబడి నాణ్యమైన పత్తిని తెచ్చి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందాలని కోరారు. ఈసమావేశంలో ఖమ్మం నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్.జి.పాపాలాల్, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ఆర్.సంతోష్‌కుమార్, మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ మందడపు నర్సింహారావు, పాలకవర్గ సభ్యులు కేవీ చారి, తల్లాడ రమేశ్, కార్మిక నాయకులు నున్నా మాధవరావు, యర్రా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# జీవో నెం.19ను తక్షణమే రద్దు చేయాలి

బేల : ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న కార్మిక సంఘాలతో చర్చించకుండా ఏకపక్షంగా జారీ చేసిన జీవో నెం.19ని ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాదవ్ రాజేందర్, డి.మలేష్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాత బేలకు చేరుకుంది. ఈ జాతకు ఇక్కడి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఘన స్వాగతం పలికారు.

అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

# వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వ కృషి

కరీంనగర్ : వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మహిళా, శిశు సంక్షేమ శాఖ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా రీజినల్ ఆర్గనైజర్ గుగులోతు రేణా అన్నారు. రెవెన్యూ గార్డెన్‌లో మహిళా, పిల్లల, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచిస్తున్న ప్రభుత్వం..పేదరికంలో ఉన్న 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఆసరా పింఛను కింద నెలకు వెయ్యి రూపాయలు అందిస్తుందన్నారు. అంతేగాకుండా అర్హులైన వృద్ధులందరికీ వీల్‌చె%ర్లు, చేతికర్రలు, చెవి మిషన్లు, కళ్లద్దాలు, కృత్రిమ దంతాలను అందించడం లాంటి కార్యక్రమాలను చేపడుతుందన్నారు. మరో ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సంయుక్త పాలనాధికారి బద్రి శ్రీనివాస్ మాట్లాడుతూ వృద్ధాప్యంలో అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అంశం ఆరోగ్యం అన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరు తమ శరీరాలు సహకారాన్ని బట్టి నడుక అలవర్చుకోవాలన్నారు. ఒకప్పటిలాగా వ్యవసాయ కుటుంబాలు, ఉమ్మడి కుటుంబాలు ఉండట్లేదన్నారు. ఆ రోజుల్లో వ్యవసాయం పనుల్లో ఆసరాగా ఉంటున్న వృద్ధులకు ఎంతో కొంత శారీరక శ్రమ ఉండేదన్నారు. ఉమ్మడి కుటుంబాలున్న రోజుల్లో వృద్ధుల మాటలను గౌరవించే వారని, వారిని పట్టించుకునే వారన్నారు. ప్రస్తుత కాలంలో ఉదయం లేస్తే సాయంత్రం వరకు ఎవరికి వారు తమతమ జీవన ప్రమాణాల్లో ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కోవాల్సిన పరిస్థితులున్నాయన్నారు. మారుతున్న కాలనుగుణంగా వృద్ధుల మనస్తత్వాల్లో మార్పు రావాల్సిన అవసరముందన్నారు. వయస్సు పైబడిన తర్వాత కూడా కుటుంబ సమస్యలన్నీ తానే పరిష్కరించాలనే తపన, ఆలోచనతో పాటు, ప్రతి చిన్న విషయాన్ని పట్టించుకోని హడావుడి పడడం మానుకోవాలన్నారు. ప్రశాంతంగా ధ్యానం, పుస్తక పఠనంతో కాలాక్షేపం అలవర్చుకోవాలని సూచించారు. వృద్ధాప్యంలో ఆరోగ్యంగా ఉంటేనే ఆనందంగా ఉంటారని, ఇతరత్రా విషయాలను పట్టించుకోకుండా ఉంటేనే మంచిదన్నారు. ఈ సందర్భంగా పలువురు వయోవృద్ధ సంఘాల బాధ్యులు మాట్లాడుతూ వృద్ధాప్యంలో ప్రతి ఒక్కరు కోరుకునేది ఒంటరి తనం కాదని, కుటుంబ సభ్యుల నుంచి కాసింత ప్రేమ, అనురాగాలు మాత్రమే అన్నారు. వృద్ధులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, ప్రభుత్వం పక్షాన అందించాల్సిన సహకారం గురించి వివరించారు. అనంతరం పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, వయోవృద్ధుల సంఘాల బాధ్యులు సముద్రాల జనార్ధన్ రావు, తోట లక్ష్మణ్ రావు, కేశవ రెడ్డి, ఎం.అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో నిందితుని అరెస్టు



శ్రీరాంపూర్ : ఏడాది కిందట శ్రీరాంపూర్ భగత్‌సింగ్ నగర్‌లో గోలేటి సోమయ్య అనే సింగరేణి కార్మికుడి ఇంట్లో దొంగతనానికి పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శ్రీరాంపూర్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీసీపీ విలేకరులకు తెలిపారు. 2016 అక్టోబర్ 23న గోలేటి సోమయ్య కుటుంబసభ్యులతో వూరికి వెళ్లగా అతని ఇంటిలో దొంగతనం జరిగింది. సీసీఎస్(క్రైం బ్రాంచి) పోలీసుల సహకారంతో శ్రీరాంపూర్ పోలీసులు ఏడాదికాలంగా కేసును దర్యాప్తు చేశారు. అందులో భాగంగానే దొంగతనాలకు పాల్పడే పాత నేరస్థుడు బైరి శ్రీనివాస్‌ను బెల్లంపల్లిలోని కాల్‌టెక్స్ వద్ద పట్టుకొని విచారించారు. విచారణలో శ్రీనివాస్ నుంచి మూడు తులాల బంగారు గొలుసు, రెండు తులాల నెక్లెస్, చెవి రింగులతోపాటు ఆరున్నర బంగారు, వెండి ఆభరణాలు పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. సోమయ్య అల్లుడు అరుణ్‌కుమార్ తన మామ మీద కోపంతో అతని కుటుంబానికి ఆర్థికంగా నష్టం కలిగించాలని నిర్ణయించుకొన్నాడు. అతడు బెల్లంపల్లికి చెందిన బైరి శ్రీనివాస్‌తో ఒప్పందం కుదుర్చుకొని సోమయ్య ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డారు. ఆ తర్వాత దొంగిలించిన సొమ్ములో అరుణ్‌కుమార్ రూ.50 వేలు, శ్రీనివాస్ రూ.17 వేలు తీసుకొని వెండి ఆభరణాలను పంచుకొన్నారు. ఈ కేసులో దొంగతనానికి మూలకారకుడైన అరుణ్‌కుమార్ పరారీలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జైపూర్ ఏసీపీ సీతారాములు, శ్రీరాంపూర్ సీఐ నారాయణ, ఎస్సై రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### కోదండరాంనే లక్ష్యంగా చేసుకొని

# విమర్శించడం తగదు: మధు

ఇల్లెందు : తెలంగాణ ఉద్యమంలో అన్నివర్గాల ప్రజలను చైతన్యవంతం చేసి స్వరాష్ట్రం ఏర్పాటులో క్రియాశీలకంగా పని చేసిన ఐకాస ఛైర్మన్ ఆచార్య కోదండరాంనే లక్ష్యంగా చేసుకొని ముఖ్యమంత్రి కేసీఆర్, తెరాస ప్రజాప్రతినిధులు మాట్లాడం తగదని ఎన్డీ అజ్ఞాత దళ నేత ఆవునూరి మధు అన్నారు. ఆయన అరెస్టులో భాగంగా న్యాయస్థానంలో వాయిదా నిమిత్తం ఇల్లెందు కోర్టులో హాజరయ్యారు. అనంతరం ఇతన్ని ఖమ్మం జైలుకు తీసుకెళ్లే క్రమంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలనీ, రైతాంగ సమస్యలతోపాటు ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. దేశంలో మతోన్మాద శక్తులు మతం పేరుతో దమనకాండ నిర్వహిస్తూ భౌతికదాడులకు పాల్పడుతున్నారనీ, వాటిని తిప్పికొట్టేందుకు ప్రజాస్వామికవాదులు, మేధావులు ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు.

గుండాల, ఆళ్లపల్లి, పునుగుడు చెలక, ఇల్లెందు మండలంలో భూగర్భ గనులను మాత్రమే ఏర్పాటు చేయాలనీ, అందుకు సంబంధించి నిధులు విడుదల చేయాలని కోరారు.

మధు న్యాయస్థానానికి హాజరవు తున్నారనే విషయం తెలుసుకున్న మన్యం ప్రజలు పెద్ద ఎత్తున కోర్టుకు చేరుకున్నారు.

# భూతగాదాతో హత్యాయత్నం

కొండపాక: వ్యక్తిగత భూతగాదాలతో ప్రత్యర్థిని కిరాయి గూండాలచే తీవ్రంగా కొట్టించి హత్యాయత్నం చేయించిన వ్యక్తితోబాటు ఏడుగురు నిందితులను మంగళవారం అరెస్టుచేసి.. రిమాండుకు పంపించినట్లు తొగుట ఎస్సై కృష్ణరంగ తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం సిద్దిపేట మండలం పుల్లూరు గ్రామానికి చెందిన జంగిటి శ్రీను, అదేగ్రామానికి చెందిన ఎల్లన్నగారి రవికి మధ్య కొంతకాలంగా భూతగాదాలున్నాయి.

సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసుకూడా నమోదైంది. ఎల్లన్నగారి రవి అతని స్నేహితుడు.. జంగిటి శ్రీనును అడ్డు తొలగించుకోవాలనుకున్నారు.రూ.30 వేలకు జంగిటి శ్రీనును అడ్డు తొలగిం చడానికి ఆ ఐదుగురు ఒప్పందం కుదుర్చు కున్నారు. సెప్టెంబరు 8న మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో సిద్దిపేట బ్లాక్ ఆఫీస్‌వద్ద తన ఆటోలో ప్రయాణికుల కోసం చూస్తున్న జంగిటిశ్రీను వద్దకు ఇద్దరు వ్యక్తులు వచ్చి ఖమ్మంపల్లికి వెళ్లడానికి 250 రూపాయ లకు అద్దె మాట్లాడుకుని బయలుదేరారు. ఖమ్మంపల్లి అడవి ప్రాంతంలో ఆగగానే సమీపంలోని మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి శ్రీను కళ్లల్లో కారం చల్లి దాడిచేశారు. ఇనుప కడ్డీలతో తీవ్రంగా కొట్టారు. స్పృహ తప్పిన శ్రీనును చూసి చనిపోయాడనుకొని వెళ్లి పోయారు. తప్పించుకుని తిరుగుతున్న నింది తులు తొగుట మండలం బండారుపల్లి మెట్టు వద్ద విందు చేసు కుంటుండగా పోలీసులను చూసి పారిపోతున్న వారిని వెంబడించి పట్టుకున్నారు. విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వారి వద్ద నుంచి ఎనిమిది వేల రూపాయల నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు.